తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 327 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | ఆదివారం, అక్టోబర్ 25, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

అర్షదీప్ సింగ్ సరికొత్త రికార్డ్..
భువనేశ్వర్‌ను అధిగమించిన యువ పేసర్!

ముంబై, అక్టోబరు 24 (న్యూస్ పల్స్): భారత యువ ఎడమచేతి వాటం పేసర్ అర్షదీప్ సింగ్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ పేరిట ఉన్న రికార్డును అతను అధిగమించాడు. న్యూజిలాండ్‌తో శనివారం హేగ్లీ ఓవల్ మైదానంలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకున్నాడు.ఈ మ్యాచ్‌లో అర్షదీప్ సింగ్ 33 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు తీశాడు. దీంతో 2026 క్యాలెండర్ సంవత్సరంలో అతని వికెట్ల సంఖ్య 38కి చేరింది. ఇంతకుముందు ఈ రికార్డు భువనేశ్వర్ కుమార్ పేరిట ఉండేది. భువనేశ్వర్ 2022 సీజన్ లో 37 వికెట్లు తీశాడు. విశేషమేమిటంటే, భువీ 31 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించగా, అర్షదీప్ కేవలం 26 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును దాటడం అతని నిలకడకు నిదర్శనం.ఈ మ్యాచ్‌లో తొలుత టిమ్ సీఫర్ట్‌ను ఔట్ చేసి న్యూజిలాండ్‌కు తొలి దెబ్బతీసిన అర్షదీప్, ఆ తర్వాత ప్రమాదకరంగా మారుతున్న గ్లెన్ ఫిలిప్స్ (70) వికెట్‌ను కూడా పడగొట్టి రికార్డును సొంతం చేసుకున్నాడు.

టీసీసీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



హైదరాబాద్ : సమావేశంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు,వివేక్ వెంకట్ స్వామి,ఏఐసిసి ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కి గౌడ్,ఇతర ముఖ్య నేతలు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూన్యాయవాదులు ప్రత్యేక మైన వృత్తి తెలంగాణ రావడంలో న్యాయవాదుల పాత్ర మరువలేనిది2023 లో ప్రజా పాలన ప్రభుత్వం రావడంలో మీరు కీలక పాత్ర పోషించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తోటి న్యాయవాది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి ని గెలిపించడానికి కృషి చేయాలి. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన అడ్వకేట్ లకు సంబంధించి సముచిత న్యాయం జరగాల్సి ఉందిగతంలో జరిగిన నియామకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ అనుబంధ వారికి అవకాశాలు ఇవ్వాల్సి ఉందితెలంగాణ లోని 33 జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఉన్నాయి. అక్కడ అడ్వకేట్స్ పార్టీకి సంబంధించిన లీగల్ ఇష్యూస్ కి అండగా ఉండాలిప్రభుత్వానికి సంబంధించిన అంశాలపై కూడా పార్టీ లీగల్ సెల్ అండగా ఉండాలిపార్టీ కార్యకర్తలకు ప్రొటెక్ట్ చేసే సమయంలో లీగల్ అండగా ఉండాలినామినేటెడ్ పోస్టుల్లో మీకు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఎలకతుర్తి లాంటి ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం కోర్టులు ఏర్పాటు చేసిందిన్యాయపరమైన పదవుల్లో కాంగ్రెస్ వారికి అవకాశాలు ఇవ్వడం న్యాయ పరమైన సలహాలు ఇవ్వడంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కారం చేయడంలో వారికి ఇళ్ల స్థలాలు ఇల్లు ఇచ్చే ఆలోచనపై కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

ఇక అర్జిదారు ఇంటికే మీసేవ సేవలు..



హైదరాబాద్: మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేదుఇంటికే వద్దకే ప్రతినిధులుటోల్‌ఫ్రీ నంబర్ రిలీజ్ చేసిన మంత్రి శ్రీధర్ బాబు. తెలంగాణ పౌరులకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించే దిశగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక అడుగు వేశారు. ప్రభుత్వ సేవలను నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే చేర్చేందుకు ఉద్దేశించిన 'మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ' సేవల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. పౌరులు మీ సేవా కేంద్రాలు, ఆధార్ సెంటర్ల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, సుదీర్ఘమైన క్యూలలో నిలబడే ఇబ్బందులకు శాశ్వతంగా చెక్ పెడుతూ ప్రభుత్వం ఈ నూతన సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది.ఇంటి వద్దకే ఆరు రకాల సేవలు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌తో బుకింగ్. ఈ పథకం ద్వారా ఆదాయం, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ నమోదు, వివరాల అప్‌డేట్ సేవలను నేరుగా ఇంటి వద్ద నుంచే పొందే వెసులుబాటు లభిస్తుంది. ప్రజలు కేవలం 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా లేదా మీ సేవా పౌరుల పోర్టల్ ద్వారా తమకు కావలసిన సమయానికి స్లాట్ సేవలను బుక్ చేసుకోవచ్చు. బుక్ చేసుకున్న సమయానికి మీ సేవా ప్రతినిధులు నేరుగా ఇంటికే వచ్చి అవసరమైన వివరాలను నమోదు చేసుకుని, నిబంధనల ప్రకారం వర్తించే రుసుముతో సేవలందిస్తారు.గ్రేటర్ పరిధిలో పైలట్ ప్రాజెక్ట్ తొలి నెలలోనే విశేష స్పందన..ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ డోర్‌స్టెప్ సేవలకు ప్రారంభమైన తొలి నెలలోనే ప్రజల నుండి ఊహించని రీతిలో భారీ స్పందన లభించింది.1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఏకంగా 3,885 కాల్స్ రావడం ఈ వ్యవస్థ ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా,ముమ్ముందు ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు సాంకేతిక సంస్కరణలు వేగవంతం చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

కరవుపై కార్యాచరణ



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడుతున్న కరవు పరిస్థితులను ఎదుర్కొనేం దుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణకు సిద్ధమవుతోంది. తాగునీరు, సాగునీటి లభ్యతను కాపాడటంతోపాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపా ధి రంగాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముం దస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా గుర్తించి, అర్హత కలిగిన ప్రాంతాలను నిబంధనల ప్రకారం ప్రకటించే ప్ర క్రియను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఉప ము ఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం నిర్ణయించింది.

కరవు, ఎల్‌ని నో పరిస్థితులపై చర్చించేందుకు త్వరలో అఖిలపక్ష స మావేశం నిర్వహించాలని కూడా తీర్మానించింది. సచివాలయంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో రాష్ట్రంలో కరవు తీవ్రత, నీటి వనరుల లభ్యత, రైతులకు అందించాల్సిన సహాయం, ప్రత్యామ్నాయ పంటల సాగు, విద్యుత్ సరఫరా, గ్రామీణ ఉ పాధి తదితర అంశాలపై చర్చించారు.కరవు ప్రభా వం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేసి, ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సి న చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని భ ట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు.రాష్ట్రంలో తక్కువ వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం తదితర ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని ప్రాథమికంగా 358 మండలాల్లో కరవు ప రిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజ య్ జాజు తెలిపారు.

మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లో కనిష్ఠ వర్షపాతం నమోదుకాగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని వివరించారు. 324 మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 31లోగా కరువు మండలాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రతి జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద రూ.1 కోటి విడుదల చేసినట్లు వెల్లడించారు.

విభజన శక్తులపై ఉమ్మడి పోరు: మోదీ



దిల్లీ: గత కొన్ని దశాబ్దాల కాలంలో సరికొత్త నవాళ్లు, సామాజిక రుగ్మతలు ఆవిర్భవిస్తున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు ఉమ్మడి ప్రయత్నం జరగాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. విభజనవాద శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని సంఘటితం చేయడంతోపాటు స్వయంసమృద్ధి దిశగా పౌరుల్ని ఉత్తేజితుల్ని చేయాలని పిలుపునిచ్చారు. దిల్లీలో మూడురోజుల పాటు జరిగే 'చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళన్'ను శుక్రవారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు.

ఒక ఆలోచన.. స్వచ్ఛమైన చైతన్యం


''చిన్మయ మిషన్ వ్యవస్థాపకులైన స్వామీ చిన్మయానంద దార్శనికతను ముందుకు తీసుకువెళ్లేందుకు గత పాతికేళ్లుగా సేవలందిస్తున్నాను. వేదాంతాలు, భగవద్గీత అందించే జ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రపంచవ్యాప్త ఆధ్యాత్మిక ఉద్యమాన్ని ఈ సంస్థ నడిపిస్తోంది. ఇదొక సంస్థ మాత్రమే కాదు.. ఒక ఆలోచన! చిన్మయ అంటే స్వచ్ఛమైన చైతన్యం. దైవత్వ సంకల్పంతో సంస్థ ప్రస్థానం కొనసాగుతోంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలనే సంకల్పం దిశగా ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలి. మరింత క్రియాశీలంగా మనమంతా వ్యవహరించాలి. స్వామీ చిన్మయానంద వంటివారు ఎంతో దూరదృష్టితో చేసిన దార్శనికత దిశగా దేశం ఇప్పుడు తన బాధ్యతల్ని నిర్వర్తిస్తోంది.

సరికొత్త భారతావనికి తగ్గట్టు విద్యావ్యవస్థ ఉండాలనే 'జాతీయ విద్యా విధానం' తీసుకువచ్చాం. మాతృభాషలో బోధన, భారతీయ విజ్ఞాన వ్యవస్థ ప్రాధాన్యానికి పెద్దపీట వేయడం వంటివి దీనిలో ఉన్నాయి. నా ప్రయత్నాలు, విధానాల్లో యువతది కీలకపాత్ర. అమృత మహోత్సవాల్లో యువత సుమారు 300 రోజుల్లో 40,000 కి.మీ. మేర ప్రయాణించడం అభినందనీయం" అని మోదీ చెప్పారు. దేశానికి చెందిన విలువైన కళాఖండాలు విదేశాలకు తరలిపోయినా ఎవరూ ప్రశ్నించేవారు కాదని, గత 12 ఏళ్లలో అలాంటి 650 వస్తువుల్ని తాము వెనక్కి రప్పించామని తెలిపారు. త్రీడీ హోలోగ్రఫిక్ డిజిటల్ రూపంలో కనిపించిన స్వామీ చిన్మయానందతో ప్రధాని ఈ సందర్భంగా సంభాషించారు. తాను 33 ఏళ్లు వెనక్కివెళ్లి ఆయనతో మాట్లాడుతున్నట్లు అనిపించిందని చెప్పారు.

75 ఏళ్ల ప్రస్థానం

ప్రపంచవ్యాప్త ఆధ్యాత్మిక ఉద్యమం కోసం 1951లో ఆవిర్భవించిన చిన్మయ మిషన్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఏడాది కాలం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముగింపు వేడుకల్లో దేశవిదేశాలకు చెందిన 9,000 మంది పాల్గొంటున్నారు.

కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు: ఉత్తమ్



హైదరాబాద్: కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. "ఎల్‌నినో వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమే. రాష్ట్ర ప్రజల కష్టాలకు కారణమైన వారే ప్రస్తుతం అబద్ధాలు చెబుతున్నారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారు. బీఆర్ఎస్ పాలనలోనే మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయింది. కేసీఆర్ తీరు వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. 2025 ఏప్రిల్‌లో మేడిగడ్డపై ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చింది. మేడిగడ్డ తరహాలోనే అన్నారం, సుందిళ్లలోనూ పరిస్థితి ఉందని చెప్పింది. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ప్రకారం మూడు బ్యారేజీలను ఖాళీ చేయాలని నిర్ణయించాం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీరు నిలుపవద్దని ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక లోపాలు ఉన్నాయని స్పష్టం చేసింది. మూడు బ్యారేజీల్లోనూ ఫౌండేషన్‌లో లోపాలు ఉన్నాయని చెప్పింది. ఫౌండేషన్ విషయంలో డీపీఆర్‌లో ఒకటి రాశారు.. నిర్మాణంలో మరొకటి చేశారు. బ్యారేజీల నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారు. అందువల్లే సమస్యలు తలెత్తాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో గేట్లు మూయవద్దని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. బ్యారేజీల గేట్లు మూయకుంటే పంపులు రన్ చేసే అవకాశమే లేదు. కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. బ్యారేజీ నిర్మాణానికి ఎంత కాంక్రీట్ అవసరమైందో.. అంత కాంక్రీట్ మరమ్మతులకు అవసరం" అని ఉత్తమ్ వివరించారు.

రాహుల్‌ది ఐరన్‌లెగ్: భాజపా

దిల్లీ, జంశెడ్‌పుర్, గువాహటి: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై భాజపా వాడి విమర్శలను కొనసాగిస్తోంది. తాజాగా రాహుల్ విఫల నేత మాత్రమే కాదని, ఆయన్ను చూస్తుంటే చిత్తవైకల్యం ఉన్న వ్యక్తిలా కనిపిస్తున్నారని భాజపా అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది పేర్కొన్నారు. దేశంలోని వ్యవస్థను, దేశ సంస్కృతిని, సంప్రదాయాలను, హిందూ విశ్వాసాలను దెబ్బతీసేందుకు రాహుల్‌ను కాంగ్రెస్ తరచూ ముందుకు తీసుకొస్తూ విఫల యత్నాలు చేస్తోందంటూ విమర్శించారు. 200 మంది ప్రభుత్వాధికారులు తనతో టచ్‌లో ఉన్నారని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపిస్తుంటాయన్న రాహుల్ వ్యాఖ్యలే ఆయన చంచల స్వభావానికి నిదర్శనాలని వివరించారు.

"ఆరెస్సెస్‌లో ఒక్క మహిళ కూడా లేదని విమర్శిస్తారు. మళ్లీ... సంఘ్‌తో సంబంధమున్న మహిళలే నాకు సమాచారం ఇస్తున్నారంటారు. పోలీసులను తిడతారు. వారే నన్ను మెచ్చుకుంటున్నారంటారు. ప్రధానిని కౌగిలించుకుంటారు. కన్నుగొడతారు. ఇవన్నీ చూశాక రాహుల్‌కు మానసిక పరిణతి ఉందనుకోవాలా? కాంగ్రెస్ పార్టీ ఆయన్ను గుడ్డిగా నమ్మి వినాశనం దిశగా అడుగులు వేస్తోంది" అని సుధాంశు వ్యాఖ్యానించారు. రాహుల్ ఎక్కడ అడుగుపెడితే అక్కడ వైఫల్యమేనని సుధాంశు త్రివేది ఎద్దేవా చేశారు.

"జాతీయ స్థాయి విలుకాడు(ఆర్చర్)గా దిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కళాశాలలో ప్రవేశం పొందిన రాహుల్ లక్ష్యం తప్పింది. ఆ తర్వాత ఆయన్ను విలుకాడుగా ప్రపంచం ఎప్పుడూ చూడలేదు. ఆపై ఆయన ఉన్నత చదువుల కోసం ఇంగ్లండ్ వెళ్లారు. 1996-99 మధ్య ఓ బ్రిటిష్ కంపెనీలో పనిచేశారు. అది మూతబడింది. అనంతరం మరో సంస్థలో భాగస్వామిగా మారి డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఆ సంస్థా మూతబడింది. 140 ఏళ్ల చరిత్రగల కాంగ్రెస్ పార్టీని అత్యంత హీనస్థితిని తీసుకొచ్చారు. ఆయన ఎక్కడ అడుగుపెడితే అక్కడ వినాశనమే" అని త్రివేది పేర్కొన్నారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

ఆదివారం, అక్టోబర్ 25, 2026

జలసంరక్షణే శ్రీరామరక్ష

నీటిబొట్టును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎడారే.. ప్రజల బాధ్యతతో పాటు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం! ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు లు తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. ఇందులో ప్రధానంగా భారత్ లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలను వణికిస్తున్న అతిపెద్ద సమస్య 'ఎల్‌నినో'. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి.. మన దేశంలో రుతుపవనాల గమనాన్ని దెబ్బతీసి, తీవ్ర కరవు పరిస్థితులకు, అకాల వర్షాలకు కారణమవుతోంది. దీనివల్ల తాగునీటి ఎద్దడి, సాగునీటి కొరత, ఆహార సంక్షోభం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా.. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజలు సంయుక్తంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది.. మరోవైపు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు నేడు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. అయినా మన నీటి వినియోగపు అలవాట్లలో ఆశించిన మార్పు రావడం లేదు. ఈ పరిస్థితి ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. మన నిర్లక్ష్యానికి కూడా అద్దం పడుతోంది. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న ముప్పు జలం లేనిదే జీవం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, పర్యావరణం.. ఇలా ప్రతి రంగానికీ నీరే ఆధారం. కానీ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, భూగర్భజలాల అధిక వినియోగం, చెరువులు కుంటల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం జలవనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ జలవనరుల నిర్వహణ బలహీనపడుతున్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత సమస్యగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేకపోవడం, ఎండాకాలంలో నీటి కోసం ఇబ్బందులు పడటం మన జల నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. భూమిలోకి చేరుతున్న నీటికంటే బోర్లద్వారా తోడుతున్న నీరు ఎక్కువైతే భూగర్భజలాల మట్టం తగ్గిపోవడం తప్పదు. దీని ప్రభావం తాగునీటి సరఫరాపైనే కాకుండా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైనా పడుతుంది. ప్రతి ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలి. నీటి సమస్యను ప్రభుత్వం మాత్రమే పరిష్కరించలేదని, ప్రజలు మాత్రమే పరిష్కరించలేరని గుర్తించాలి. ఇరువురి భాగస్వామ్యం తప్పనిసరి. వర్షాకాలంలో ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి ఇంకేలా చేయడానికి ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. నీటి సంరక్షణ అంటే నీటిని తక్కువగా వినియోగించడం మాత్రమే కాదు.. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించడం కూడా. ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం. జలసంరక్షణలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా ఫలితాలు కనిపించే చర్యలు చేపట్టాలి. ముందుగా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర సహజ జలవనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించి, నీరు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అవసరమైన చోట పూడికతీత చేపట్టి, చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు అయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఈ వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించాలి.ఇంకుడు గుంతలు నిర్మించడం వరకే కాకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని నీటి లభ్యత, వినియోగం, వృథా, భూగర్భజలాల పరిస్థితిని అంచనా వేసి స్థానిక జల ప్రణాళికలు రూపొందించాలి. తాగునీటి పైపుల లీకేజీలను త్వరగా సరిచేయాలి. నీటి సరఫరాలో జరిగే నష్టాలను తగ్గించాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని మెరుగుపరచడం అత్యవసరం. రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా శాస్త్రీయ సలహాలు అందించాలి. అవసరానికి మించి నీటిని పెట్టకుండా పంట అవసరాన్ని బట్టి సాగునీటిని అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, చిన్న నీటి నిల్వ కేంద్రాలను పునరుద్ధరించి వర్షపు నీటిని వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలి. రైతులకు సాంకేతిక సహాయం, శిక్షణ, సూక్ష్మ సేద్య పరికరాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. మరిన్ని కనుగొనండి వార్తాపత్రిక యాక్సెస్ ప్రాంతీయ వార్తలు సేవ రాష్ట్ర వార్తలు సేవ మురుగునీటిని శుద్ధి చేసి, తాగునీరు అవసరం లేని పారిశ్రామిక, ఇతర పనులకు ఉపయోగించే వ్యవస్థలను పట్టణాల్లో బలోపేతం చేయాలి. జలసంరక్షణకు జవాబుదారీతనం అవసరం ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదు. వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలి. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలి. ఈ రోజు మనం కాపాడే ప్రతి నీటి బొట్టు రేపటి తరాల జీవనానికి భరోసా కావాలి. నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ రోజే జలసంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు బాధ్యతతో ముందడుగు వేయాలి..

- ఎడిటర్

నైపుణ్య విద్యకు పెద్దపీట వేయాలి: అల్ఫోర్స్ అధినేత డా. నరేందర్ రెడ్డి

కరీంనగర్, అక్టోబర్:24: నైపుణ్య విద్యకు పెద్దపీట వేయాలని ఆల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయదశమి సందర్భంగా ఆయన ఆస్ట్రేలియా పర్యటన విశేషాలను మీడియాకు వెల్లడించారు. అక్టోబర్ 17 నుంచి 22 వరకు పశ్చిమ ఆస్ట్రేలియాలో పర్యటించి, పలు యూనివర్సిటీలు, పాఠశాలలను సందర్శించినట్లు తెలిపారు..దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 12 మంది ఎడ్యుకేషన్ లీడర్లతో కలిసి అక్కడి విద్యా విధానం, కరిక్యులం, ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారులిఒకేషనల్, టెక్నికల్ విద్యపై దృష్టి అవసరం

మన దేశంలో విద్య కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, డాక్టర్లను తయారు చేసే దిశగానే సాగుతోందని నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీనివల్ల అందరూ ఆ స్థాయికి చేరలేక నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, టెక్నికల్, ఒకేషనల్, స్కిల్ బేస్డ్ కోర్సుల్లో వెనుకబడిపోతున్నామని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక పనులకు సైతం ఇతరులపై ఆధారపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆస్ట్రేలియాలో మాత్రం బైపీసీ,



ఎంపీసీలతో పాటు సీఈసీ, ఎంఈసీ, వెటర్నరీ, ఆర్ట్స్, మ్యూజిక్, స్పోర్ట్స్ తదితర అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని, అక్కడ విద్యార్థుల్లో ఎలాంటి ఒత్తిడి కనిపించదని పేర్కొన్నారు.పాఠశాల స్థాయిలో ఒకే విద్యా విధానం

అక్కడ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా విధానం అమల్లో ఉందని, మధ్యలో బోర్డు పరీక్షల ఒత్తిడి లేకుండా ఇంటర్నల్ ఎగ్జామ్స్‌కు 50 శాతం మార్కులు కేటాయిస్తున్నారని తెలిపారు.మన రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ జూనియర్ కళాశాలను పాఠశాల స్థాయిలో విలీనం చేసే అంశంపై స్పష్టతనిచ్చిన నేపథ్యంలో, ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే 8వ తరగతి నుంచే విద్యార్థులకు నచ్చిన సబ్జెక్టులు (బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, అగ్రికల్చర్ సైన్స్, స్పోర్ట్స్) ఎంచుకునే స్వేచ్ఛ ఉందని వివరించారు. మైనర్ పిల్లల ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని అక్కడ చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని చెప్పారు.

?అల్ఫోర్స్‌లో ఇంటర్నేషనల్ కరిక్యులం

తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో త్వరలో వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు నరేందర్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి ప్రభుత్వ ఆమోద ప్రక్రియ తుది దశకు చేరిందని, రాబోయే విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి రెండో తరగతి వరకు ఈ కరిక్యులంతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

?తల్లిదండ్రులకు విజ్ఞప్తి

మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి తేవద్దని, ఐఐటీ, మెడిసిన్‌తో పాటు క్లాట్, సీఏ, అగ్రికల్చర్, స్పోర్ట్స్ తదితర రంగాల వైపు కూడా పిల్లలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో ఇన్ఫ్రాస్ట్రక్చర్, డిజిటల్ బోర్డులు, లేబరేటరీలను మరింత ఆధునీకరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన పీఆర్టీయు నాయకుల పరిచయ కార్యక్రమం

జహీరాబాద్ అక్టోబర్ 24: జహీరాబాద్ అర్బన్, రూరల్ పట్టాన జహీరాబాద్ లోని వివిధ కార్యాలయాల్లో ఉన్నత అధికారులను కలసి నూతనంగా ఎన్నికైన రాష్ట్ర, జిల్లా, మండలాల కమిటీలో స్థానం పొందిన నాయకులు పరిచయమయ్యారు.

జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా నాయక్, డిఎస్పీ సైదా నాయక్ గారికి, ఎంపీడీఓ మహేందర్ రెడ్డి, ఎంఈఓ మాణయ్య, ఎస్టిఓ చారీ, కొండల్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ ప్రభాకర్ ను కలసి సంఘం జహీరాబాద్ అర్బన్, రూరల్ కమిటీ సభ్యుల వివరాలు ఉన్న పత్రం ను సమర్పించారు. సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు



డా. తులసిరామ్ రాథోడ్, జహీరాబాద్ అర్బన్ అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి తుకారాం చవ్వాణ్, జహీరాబాద్ రూరల్ అధ్యక్షులు రమేశ్ బానోత్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాలయ్య, శివరాజ్, స్వామిదాస్, బాగయ్య, బుల్లెట్ రాజు,సంగమేశ్వర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు మెరినా, రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ నమీ,జిల్లా బాధ్యులు రాచన్న, వీరేశం,అమిత్ కుమార్,మండలాల బాధ్యులు రఫీక్ హుస్సేన్,శివరాజ్,హన్మంత్ పవార్, రమేశ్ పవార్, ప్రణుతి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యునికి ఘన సన్మానం చేసిన డాక్టర్ కొండ దేవయ్య పటేల్

బ్యూరో చీఫ్ వేములవాడ అక్టోబర్ 24 ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యునిగా నియమింపబడిన నిరంతరం సమాజహితం, సంఘ శ్రేయస్సు ధ్యేయంగా సేవలందిస్తున్న వేములవాడ మున్నూరు కాపు సత్రం ఉపాధ్యక్షులు ప్రముఖ ఇంజనీర్ కోల అన్నారెడ్డి కి మున్నూరు కాపు సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ శాలువాతో ఘన సన్మానం చేసి శ్రీ రాజరాజేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేయడం జరిగింది. సందర్భంగా కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ అన్నా రెడ్డి వంటి ఆదర్శం గల వ్యక్తులు అరుదని సమాజానికి ఏదో చేయాలని తపన కలిగిన వ్యక్తి అన్నా రెడ్డి అని అలాంటి వ్యక్తి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక కావడం చాలా గొప్ప విషయమని శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు సత్రానికి 90 లక్షల రూపాయలు దాతల నుండి సేకరించి ఇచ్చారని వారిని మనన్నార్తిగా అభినందిస్తున్నానని అన్నారు. ఈ



సందర్భంగా అన్నా రెడ్డి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని సమాజంలో అందరూ బాగుండాలని ప్రజలంతా ఆధ్యాత్మికత వైపు ఉండాలి అని మీ అందరి సహాయ సహకారాలు ఉన్నాయని అందుకే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక అయ్యానని తను సమాజ హితం కోసం ముందుకు సాగుతానని వారు అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో మున్నూరు కాపు సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, సత్రం ఆర్గనైజింగ్ కార్యదర్శిచిలుక రమేష్, సాయి ని నరేందర్, కర్నే రాజమౌళి చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిడికిటి గోపాల్ చౌదరి ఘనంగా జన్మదిన వేడుకలు



ఈరోజు కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు సోషల్ మీడియా వారియర్ పిడికిటి గోపాల్ చౌదరి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్లో ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ గారు పాల్గొని ఆశీస్సులు అందించి బర్త్డే కేకు కటింగ్ చేయించి శుభాకాంక్షలు అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య ,చలసాని నళినీకాంత్, రంగమోహన్. కిలారి బాబు చావా శ్రీనివాస్, శివా చౌదరి హరి ప్రసాద్ కళ్యాణ్,ఆదినారాయణఆలీ రమణ హరిప్రసాద్ నాయుడు పర్వేజ్ అశోక్ నవా

కన్నెపల్లి పంప్ హౌసు , మేడి గడ్డను సందర్శన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం.

తెలంగాణ పవర్ న్యూస్ ఎల్బీనగర్ అక్టోబర్ కన్నేపల్లి పంప్ హౌస్, మేడిగడ్డను బి ఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం సందర్శించి పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడిగడ్డ వద్ద ఇప్పటికే 751 టీఎంసీల నీళ్లు కిందికి వదిలేశారని,అందులో 200 టీఎంసీల నీళ్లు లిఫ్ట్ చేసినా హైదరాబాద్ తాగునీటి సమస్యతో పాటు,రైతులకు నీళ్లు అందించేవారని

ఇప్పటికీ కూడా మేడిగడ్డ వద్ద 22 వేల క్యూసెక్కుల నీళ్లు దిగువకు పారుతున్నయి.ఈ నీటిని లిఫ్ట్ చేసి కాళేశ్వరం ద్వారా నీళ్లు అందిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని,కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని చేసిన దుష్ప్రచారం తెలిసిపోతుందని నీటిని ఎత్తడం లేదు.వీటిని ప్రజలకు చూపించి,ఇప్పటికైనా నీటిని లిఫ్ట్ చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,కేపీ వివేకానంద,మాధవరం కృష్ణారావు,మర్రి రాజశేఖర్ రెడ్డి,బండారు లక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు నాయకులు కార్యకర్తలు యువత తదితరులు పాల్గొన్నారు.





హైదరాబాద్ లో తీవ్ర వాయుకాలుష్యం..

హైదరాబాద్, అక్టోబరు 24 (న్యూస్ పల్స్)రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం స్లో పాయిజన్‌లా మారి మనుషుల ప్రాణాలు తీసేస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్, నల్గొండ, సంగారెడ్డి నగరాల్లో గాలి నాణ్యత క్షీణిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతాల్లో వాహనాల పొగ, పరిశ్రమల వ్యర్థాలు, రోడ్లపై లేచే దుమ్ము, ధూళి, నిరంతర నిర్మాణ కార్యకలాపాల వల్ల ఆరోగ్యకరమైన గాలి పీచడం కష్టంగా మారింది.2025-26 వార్షిక సగటు గణాంకాల ప్రకారం, సూక్ష్మ ధూళి కణాలైన పీఎం-10 (ఖఓ-10) స్థాయిలు జాతీయ ప్రమాణాలను మించి నమోదవడంతో పరిస్థితి అదుపు తప్పుతోంది. హైదరాబాద్‌లో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం అధికంగా కాలుష్యం నమోదు కాగా, సంగారెడ్డిలో 30 శాతం, నల్గొండలో 18.3 శాతం మేర అధికంగా నమోదవుతోంది.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం, గాలిలో పీఎం-10 వార్షిక సగటు క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములకు మించరాదని నిపుణులు చెబుతున్నారు. అయితే 2025-26 లెక్కల ప్రకారం హైదరాబాద్‌లో ఈ స్థాయి 80 మైక్రోగ్రాములు ఉండగా, సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పీఎం-10 వార్షిక సగటు కేవలం 15 మైక్రోగ్రాములు మాత్రమే ఉండాలి. కానీ హైదరాబాద్‌లో డబ్ల్యూహెచ్ఓ పరిమితి కంటే 5.3 రెట్లు ఎక్కువగా ఉండగా, సంగారెడ్డిలో 5.2 రెట్లు, నల్గొండలో 4.7 రెట్లు అధికంగా ప్రమాదకర స్థాయిల్లో కాలుష్యం ఉంది.ఈ సూక్ష్మ ధూళి కణాలు శ్వాస వ్యవస్థ ద్వారా శరీరంలోకి ప్రవేశించి మీ ఊపిరితిత్తులతో పాటు రక్తప్రసరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో నవంబర్ 4న శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం

గోమాత, శ్రీకృష్ణ పూజలు.. ప్రత్యేక ఆకర్షణగా దేశీ దున్నారాజుల ప్రదర్శన

అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్



హైదరాబాద్: నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నవంబర్ 4న శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం, గోమాత పూజ, శ్రీకృష్ణ పూజలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కార్యక్రమ వివరాలను వెల్లడించారు. నవంబర్ 4న బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు వేలాది మంది భక్తులు, యాదవ సంఘాల ప్రతినిధులు, రైతులు, యువత హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పండుగగా గుర్తింపు లభించడం యాదవ సమాజానికి గర్వకారణమని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని అన్నారు. సదర్ సమ్మేళనం ఒక వర్గానికి మాత్రమే పరిమితం కాదని, సామాజిక ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఈసారి ప్రత్యేక జాతుల దున్నారాజుల ప్రదర్శనతో పాటు దప్పు, డోలు, సంప్రదాయ వాద్యబృందాల ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ నాయకులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. అన్ని కులాలు, మతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని అంజన్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

గ్రామీణ ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించడం అభినందనీయం

కూచుకుళ్ల రామచంద్రారెడ్డి ఐ సెంటర్ 28వ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి



నాగర్ కర్నూల్ జిల్లా తెలంగాణ పవర్ : ప్రతినిధి అక్టోబర్ -24: నాగర్‌కర్నూల్: గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించడంలో కూచుకుళ్ల రామచంద్రారెడ్డి ఐ సెంటర్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అన్నారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యంతో తూడుకుర్తి గ్రామంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రం 28 ఏళ్లుగా ప్రజలకు నేత్ర వైద్య సేవలు అందించడం సంతోషకరమని పేర్కొన్నారు.

నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తిలో శనివారం నిర్వహించిన ఐ సెంటర్ 28వ వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన నేత్ర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ కేంద్రం పనిచేస్తోందన్నారు. ప్రజలు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో నేత్ర పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స పొందాలని సూచించారు. తన తండ్రి పేరుతో నిర్వహిస్తున్న ఈ కేంద్రం ద్వారా ఎంతోమందికి ప్రయోజనం కలగడం సంతృప్తినిస్తోందని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి: కలెక్టర్

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి చొరవతో గ్రామీణ ప్రజలకు మెరుగైన నేత్ర వైద్య సేవలు అందుతున్నాయని ప్రశంసించారు. కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమని, దృష్టి సమస్యలు వ్యక్తిగత జీవితంతోపాటు కుటుంబ, సామాజిక జీవితాలపై కూడా ప్రభావం చూపుతాయని అన్నారు.


కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముందస్తు పరీక్షలతో కంటి వ్యాధులను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని తెలిపారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడంతోపాటు కంటి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగికి నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు

ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, తహసీల్దార్ తబితా రాణి, గ్రామ సర్పంచ్ లక్ష్మి, కరుణాకర్ రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై అవగాహన సదస్సు

పాల్గొన్న సాంస్కృతిక సారథి కవి, గాయకుడు పిన్నింటి రత్నం



కొమురవెల్లి: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ఎల్‌నినో ప్రభావంపై అవగాహన సదస్సులో అయినాపూర్ గ్రామానికి చెందిన సాంస్కృతిక సారథి కవి, గాయకుడు పిన్నింటి రత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్యం కోసం ఐదు పాటలు రచించి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. సారథి కవులు రచించిన 100 పాటలు త్వరలో పుస్తక రూపంలో రానున్నాయని పేర్కొన్నారు. నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ పొదుపుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



నాగర్ కర్నూల్ (తెలంగాణ పవర్) అక్టోబర్ : 24: ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఉద్యోగుల న్యాయ సమ్మతమైన సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వం పతనం తప్పదని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) వైద్య సిబ్బంది తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగింది

ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వైద్య రంగంలో సేవలందిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది పోరాటానికి ఐద్వా మహిళా సంఘం పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారుతెలంగాణ రాష్ట్రంలో 17వేల మంది ఎన్ హెచ్ఎం పరిధి కింద పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి పర్మినెంట్ చేయాలని వేతనాల పెంపు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి ఎన్‌హెచ్‌ఎం కేడర్ ఉద్యోగికి 100 శాతం గ్రాస్ జీతం అందించాలి కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం మూడేళ్లకోసారి బదిలీ చేసే విధానాన్ని రద్దు చేసి, బదిలీ అయిన ఉద్యోగులను పాత స్థానాల్లో నియమించాలి. జి.ఓ. 1195ను పునఃపరిశీలించాలి. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం 60% రాష్ట్ర ప్రభుత్వం 40% కల్పి ఇంక్రిమెంట్లు ఇవ్వాల్సి ఉన్న అవి ఏవి ఇవ్వకుండా కార్మికులతో శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆయన అన్నారు 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న పనికి తగ్గ పారితోషకం లేదని ఆయన అన్నారు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 108 రోజుల ప్రసూతి సెలవులు వెంటనే ఇవ్వాలని పై సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు చీనవీజిల్లా అధ్యక్షులు బాలకృష్ణ శ్రీనివాసులు దేవుడు వనజ అరుణ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించండి.

వాటర్ వర్క్స్ అధికారులకు సిపిఐ వినతి పత్రం.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 24,తెలంగాణ పవర్,ప్రతి నిధి.: ఎల్నీనో కారణంగా రాబోవు రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది కాబట్టి ప్రజలను అప్రమత్తత చేయడానికి, నీటి వృధాను అరికట్టడానికి వాటర్ వర్క్స్ అధికారులు అన్ని బస్తీలలో పర్యటించి ప్రజలను చైతన్యపరిచి నీటిని వృధా చేయకుండా చూడాలని నేడు సిపిఐ ఆధ్వర్యంలో చింతల్ సర్కిల్ వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వికాస్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ,రాష్ట్ర నాయకులు ఏసురత్నం మాట్లాడుతూ బస్తీలలో మంచినీరు సరఫరా చేసే సమయంలో అధికారులు పర్యటించి ఎవరైతే నీరు వృధా చేస్తున్నారో వారికి జరిమానా విధిస్తే నీటిని వృధా చేసే మిగతా ప్రజలు కూడా భయపడి నీటిని వృధా చేయకుండా ఉంటారని అన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అనేకసార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారని , నీటి వృధానీ అరికట్టాల్సిన వాటర్ వర్క్స్ అధికారులు అధికారులు కూడా ప్రకటనలకే పరిమితమైతే సరిపోదని వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు మొదలుపెట్టాలని అదేవిధంగా అక్రమంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లను కూడా మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు గిరి నగర్ మరియు జగద్గిరి గుట్టలో వివిధ ప్రాంతాలలో వివిధ బస్తీలలో ఎక్కడెక్కడ నీరు వృధాగా పోతుందో వాటి వివరాలను వాటర్ వర్క్స్ అధికారులకు ఇవ్వడం జరిగింది. వారం రోజుల్లోపు సిపిఐ ఇచ్చిన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్ సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ప్రజానాట్య మండల అధ్యక్షులు బాబు యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, కీర్తి శాఖ కార్యదర్శి వెంకటేష్, యాకూబ్, సిపిఐ నాయకులు ఇమామ్ యాదన్న, సాగర్, రాజేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



దసరా సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా వారి నివాసం వద్ద కలిసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు...



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,అక్టోబర్ 24,తెలంగాణ పవర్,ప్రతి నిధి.: విజయదశమి దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రివర్యులు, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా వారి నివాసం వద్ద కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్ , డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ , రుద్ర అశోక్ మరియు పోలే శ్రీకాంత్ కలిసి కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా వారి నివాసం లో కలిశారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం పనిచేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, పార్టీ నాయకత్వం సూచనలతో ప్రజాసేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని నాయకులు తెలిపారు.

పత్తి రైతులను ఆదుకోవాలి: వై.నరోత్తం డిమాండ్



జహీరాబాద్ అక్టోబర్ 24:జహీరాబాద్ నియోజకవర్గంలో పత్తి పంట పొలాలను శనివారం ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం పరిశీలించారు.ఈ సందర్భంగా పత్తి పంట పరిస్థితిని,దిగుబడి అవకాశాలను, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ,ప్రతికూల వాతావరణ పరిస్థితులు, దిగుబడుల తగ్గుదల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంతంలో పత్తి రైతులకు సాగు ఖర్చులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు.గత ఏడాది తెలంగాణలో సుమారు 44.75 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం సుమారు 45.95 లక్షల ఎకరాలకు పెరిగినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరాకు సగటున 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.దుక్కులు దున్నడం,విత్తనాలు, ఎరువులు,పురుగుమందులు, ఇతర వ్యవసాయ పనులు, పత్తి ఏరడం తదితర ఖర్చులు కలిపి ఎకరాకు సుమారు రూ.48,000 అవుతున్నాయన్నారు.

ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చి, క్వింటాలుకు రూ.8,667 చొప్పున ధర లభించినా రైతుకు వచ్చే ఆదాయం కేవలం రూ.34,668 మాత్రమే. ఈ లెక్కన ఎకరాకు రూ.13,332 నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 43,352 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని, దాదాపు 22,940 మంది రైతులు ఈ పంటపై ఆధారపడి ఉన్నారని తెలిపారు,

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

పత్తి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్.

కార్యక్రమంలో నాయకులు శివకుమార్, మల్లేశం, వీర్ సంగప్ప, చెంగల్ జైపాల్,లక్ష్మి నారాయణ, తుక్కన్న, యం.డి.రైసోద్దీన్, బి.రాములు,కే.మల్లేశంతదితరులు ఉన్నారు.

హయత్‌నగర్‌లో ఉద్రిక్తత..

255 సర్వే నంబర్ వద్ద భారీగా పోలీసుల మోహరింపు! ఇందిరమ్మ టవర్స్ కోసం భూసేకరణకు అధికారుల రాక

రంగారెడ్డి,హయత్‌నగర్ పరిధిలోని 255 సర్వే నంబర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం కోసం స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు రావడంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.పరిస్థితులు తీవ్రరూపం దాల్చకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఏం జరుగుతుందనే అంశంపై స్థానికంగా ఉత్కంఠ నెలకొంది.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ డి ఆర్ ఐ అధికారులు తనిఖీలు

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా విదేశీ కరెన్సీ పట్టుబడింది. మలేషియాలోని కౌలాలంపూర్‌కు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన రూ.1.56 కోట్ల విలువైన విదేశీ కరెన్సీని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (ఆఖీఎ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒక మహిళతో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. 2026 అక్టోబర్ 22, 23 తేదీల్లో అందిన పక్కా సమాచారంతో ఆఖీఎ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. అక్టోబర్ 22న ఎయిర్‌ఏషియా విమానం ంఐ-68లో హైదరాబాద్ నుంచి మలేషియాలోని కౌలాలంపూర్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఓ భారతీయ ప్రయాణికుడిని అధికారులు అడ్డుకున్నారు.అతని ట్రాలీ బ్యాగులో తనిఖీలు నిర్వహించగా, దుస్తుల మధ్య నల్లటి ప్లాస్టిక్ కవర్‌లో దాచిన 66,600 అమెరికన్ డాలర్లు, 3,773 మలేషియా రింగిట్లు, 2 సింగపూర్ డాలర్లు గుర్తించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.63.62 లక్షలుగా అధికారులు అంచనా వేశారు..

ఈతకు వెళ్ళిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు స్నేహితులు మృతి

వికారాబాద్ , బంట్వారం మండల పరిధిలోని బొపునారం గ్రామంలో ఈతకు వెళ్ళిన ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపుతుంది.బొపునారం గ్రామంలోని ఎర్రమట్టి మైనింగ్ కోసం తవ్విన గుతల్లో భారిగ నీరు నిలవడంతో కర్ణాటక రాష్ట్రం కుంచారం గ్రామానికి చెందిన అజయ్(17),సురేందర్ (17) ఇద్దరు స్నేహితులు ఈతకోసం అని తెలంగాణ సరిహద్దు బొపునారం గ్రామానికి వెళ్లి చనిపోయిన ఘటన స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈతకు వెళ్ళిన ఇద్దరు అజయ్, సురేందర్ స్నేహితుల్లో అజయ్ కి మాత్రమే ఈత రావడంతో ఈత రాని సురేందర్ భయంతో అజయ్ ని గట్టిగ పట్టుకోవడంతో ఈ ఘటన జరిగిందని అంటున్నారు స్థానికులు.రెండు కుటుంబాలకు చెందిన అజయ్, సురేందర్ మృతి చెందడంతో తల్లి తండ్రులు, బందువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.సంఘటన స్థలానికి చేరుకున్న బంట్వారం పోలీసులు మృతదేహాలను పోస్టు మార్టం కోసం మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

కుళ్లిన అల్లం.. ఫంగస్ వెల్లుల్లితో పేస్ట్ తయారీ!

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్వెల్లిలో 'ఏ' కేంద్రంపై అధికారుల మెరుపుదాడి.. 22 కిలోల వెల్లుల్లి.. 50 కిలోల అల్లం స్వాధీనం చేసినట్లు వెల్లడి....

మేడ్చల్,ప్రజలకు విక్రయించే ఆహార పదార్థాల తయారీలో ఇంత నిర్లక్ష్యమా? ఫంగస్ పట్టి కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లితో పేస్ట్ తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించడం కలకలం రేపింది. మేడ్చల్ జీహెచ్ఎంసీ పరిధిలోని అత్వెల్లి గ్రామంలో 'ఏ1' బ్రాండ్ తయారీ కేంద్రంపై శుక్రవారం ఉదయం ఎస్ఓటీ, టీజీసీఎఫ్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో 22 కిలోల కుళ్లిన వెల్లుల్లి, 50 కిలోల అల్లం గుర్తించినట్లు మేడ్చల్?కుత్బుల్లాపూర్ జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృత శ్రీ వెల్లడించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా వినియోగానికి పనికిరాని ముడి పదార్థాలతో అల్లం?వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి 'ఏ1' బ్రాండ్ పేరుతో మార్కెట్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉత్పత్తుల నమూనాలను అధికారులు సేకరించారు.ఆహార పదార్థాల తయారీకి అవసరమైన లైసెన్స్‌లు తీసుకోవడంతోపాటు పరిశుభ్రమైన ప్రదేశాల్లోనే ఉత్పత్తులు తయారు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పదవీకాలం ముగిసిన మార్కెట్ కమిటీలకి నూతన పాలకవర్గాలు నియామిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్,పదవీకాలం ముగిసిన నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్, సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మరియు ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ (ంఓఅ)లకి నూతన పాలకవర్గాలను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ రోజు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, నూతన పాలకవర్గానికి రెండేళ్ల పదవీకాలం ఉండనుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత ఉ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతెలియజేశారు. నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్, సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మరియు ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల జిల్లా మార్కెట్ కమిటీల తొలి పాలకవర్గాల పదవీకాలం ఇటీవల ముగిసింది. పదవీకాలం ముగిసిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా నూతన పాలకవర్గాన్ని నియమించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత ఉ జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మార్కెట్ కమిటీకి చైర్మన్ గా పసుపుల షమీమ్, వైస్ చైర్మన్ గా పసుపుల నరసింహ మరియు సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మార్కెట్ కమిటీకి చైర్మన్ గా మాతంగి శిరీష, వైస్ చైర్మన్ గా పర్ణ సంతోష్, ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ గా అంతగిరి సాహిత్య, వైస్ చైర్మన్ గా గాన్రెడ్డి భరత్ రెడ్డి గార్లని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు

వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మహిళా జర్నలిస్టులు హాజరు -నిర్భయంగా ప్రశ్నించే గొంతుకలను అణచివేయలేరు: -మంత్రి సీతక్క

ప్రజాస్వామ్య పరిరక్షణ, అణగారిన వర్గాల గొంతుకను బలంగా వినిపించడంలో మహిళా జర్నలిస్టుల పాత్ర కీలకం:విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి

మహిళలలు నిర్భయంగా నేతృత్వం వహించాలి: -మల్కాజిగిరి కమిషనర్ సుమతి

హైదరాబాద్:అక్టోబర్24 ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో, సమాజంలో అణగారిన వర్గాల గొంతుకను బలంగా వినిపించడంలో మహిళా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫీ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని టూరిజం ప్లాజా హోటల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా పాత్రికేయులు హాజరయ్యారు.

జాతీయ సెమినార్ ప్రారంభోత్సవ సభలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ జి. రాధారాణి, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి (ఐపీఎస్) , తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్, ఐ జె యు స్టీరింగ్ కమిటీ సభ్యులు డి.అమర్, ఎస్.ఎన్.సిన్హా, ఐజేయు అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్ము, సెక్రెటరీ జనరల్ డి.సోమసుందర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ హాజరయ్యారు. సీనియర్ జర్నలిస్టులు స్వప్న, టీయూడబ్ల్యూజే మహిళా విభాగం కన్వీనర్ రాజేశ్వరి కళ్యాణం, అత్తలూరి అరుణ, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిజాలను నిగ్గుతేల్చడమే జర్నలిజం కర్తవ్యం: జస్టిస్ రాధారాణి

సదస్సులో జస్టిస్ జి. రాధారాణి కీలక ఉపన్యాసం చేస్తూ... జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని . స్వతంత్ర పత్రికారంగం లేకుండా ప్రజాస్వామ్య మనుగడ సాధ్యం కాదని ఆమె పేర్కొన్నారు.ప్రశ్నించే తత్వమే పత్రికారంగానికి ప్రాణవాయువని, నిష్పాక్షికమైన వాస్తవాలను సమాజం ముందుంచడమే జర్నలిస్టుల కర్తవ్యమని అన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 19(1)(ఎ) భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రసాదిస్తే, అధికరణ 19(2) బాధ్యతాయుతమైన పరిమితులను నిర్దేశించిందని గుర్తుచేశారు. డిజిటల్ మాధ్యమాలు విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో అసత్య ప్రచారాలు, డీప్‌ఫేక్, ఏఐ సాంకేతికత వల్ల విశ్వసనీయతకు ముప్పు వాటిల్లుతోందని, వాస్తవాల పరిశీలన (ఫ్యాక్ట్ చెకింగ్) ఎంతో అవసరమని సూచించారు. కార్యాలయాల్లో పని ప్రదేశ వేధింపుల నిరోధక (పోష్) చట్టాన్ని మీడియా సంస్థలు పక్కాగా అమలు చేయాలని, మహిళా జర్నలిస్టులకు తగిన రక్షణ, వృత్తిపరమైన సమాన అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు.

ప్రశ్నించే హక్కును ఎవరూ కాలరాయలేరు: మంత్రి సీతక్క

రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ... భయంతో ఏ మహిళా తన గొంతును నొక్కేసుకోకూడదని స్పష్టం చేశారు. చేతిలో మైక్ పట్టుకున్న మహిళ శత్రువు కాదని, సమాజ హితం కోసం నిలదీసే పాత్రికేయులు వ్యవస్థకు



ఎన్నటికీ ముప్పు కారని ఆమె ఉద్ఘాటించారు. "మహిళల ప్రగతిని బట్టే ఆ సమాజ ప్రగతి ఆధారపడి ఉంటుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఏనాడో చెప్పారు. మేం రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసమే పోరాడుతున్నాం తప్ప, ఎవరి భిక్షనూ కోరడం లేదు" అని తేల్చిచెప్పారు. విధి నిర్వహణలో మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు, వ్యక్తిత్వ హననం వంటి చర్యలను తీవ్రంగా ఖండించారు. వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ కోసం మహిళా జర్నలిస్టులంతా ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు.

న్యాయం కోసం నిలబడే శక్తి మహిళలకుంది: ఐపిఎస్ సుమతి

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి (ఐపీఎస్) మాట్లాడుతూ... మహిళలు ప్రతి సమస్యను సమగ్ర కోణంలో విశ్లేషించే సామర్థ్యం కలిగి ఉంటారని, వారు కేవలం డెస్క్‌లకు మాత్రమే పరిమితం కాకుండా ఫీల్డ్ రిపోర్టింగ్‌లో ముందుండి నిర్భయంగా, నేతృత్వం వహిస్తూ ప్రజాస్వామ్యానికి సరికొత్త దిశానిర్దేశం చేయాలని కోరారు.మహిళలు అన్నిశీటిని అధిగమిస్తేనే ముందుకు వచ్చే పరిస్థితులు వుంటాయని వివరించారు. వివిధ రంగాలలో మహిళలు రాణించడం సాధారణ విషయం కాదని, అనేక అవాంతరాలను అధిగమించాల్సి ఉంటుంది అని చెప్పారు.

కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్ మాట్లాడుతూ... న్యూస్‌రూమ్‌లలో మహిళా జర్నలిస్టులు తమ ప్రాధాన్యాన్ని నిరూపించుకోవాలని, సానుభూతితో కూడిన మానవీయ కథనాలను సమాజానికి అందించాలని పేర్కొన్నారు.

అంతకుముందు ఐజేయూ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్ము ప్రారంభోపన్యాసం చేస్తూ క్షేత్రస్థాయిలో మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను వివరించారు. ఇటీవల రీతిక చోప్రా వంటి జర్నలిస్టులు ఎన్నికల సంఘం, ఎస్ ఐ ఆర్ గురించి నిర్భయంగా కథనాలు రాసారని గుర్తు చేశారు.


హైదరాబాద్ జూకు వంతారా నుంచి కంగారూలు, లెమూర్లు రాక!

హైదరాబాద్, అక్టోబరు 24 (న్యూస్ పల్స్)హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా వన్యప్రాణి ప్రేమికులకు నెహ్రూ జూలాజికల్ పార్క్ సరికొత్త జీవులను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు చెందిన ప్రముఖ గ్లోబల్ వైల్డ్‌లైఫ్ రెస్క్యూ , కన్జర్వేషన్ సెంటర్ వంతారా నుంచి విదేశీ రకాలకు చెందిన అరుదైన జంతువులను నగరానికి తీసుకొచ్చేందుకు జూ అధికారులు ప్రణాళికలను వేగవంతం చేశారు. ఆస్ట్రేలియా దేశానికి చెందిన సంకేతమైన కంగారూలు , వాలబీలు , మడగాస్కర్ మూలాలున్న రింగ్-టెయిల్డ్ లెమూర్లు, కాసోవారీ రకం పక్షులు త్వరలోనే నెహ్రూ జూ పార్క్‌లో సందడి చేయనున్నాయి. జూ చరిత్రలోనే తొలిసారిగా ఒక ఆడ, మగ కంగారూలను ప్రదర్శనగా ఉంచేందుకు ప్రత్యేక ఎన్‌క్లోజర్లను, నైట్ హౌస్‌లను అధికారులు సిద్ధం చేశారు. గతంలో 2020లో జపాన్‌లోని యోకోహామా జూలాజికల్ గార్డెన్స్ నుంచి నాలుగు కంగారూలను తీసుకురావడానికి ఒప్పందం కుదిరినప్పటికీ, కరోనా మహమ్మారి విజృంభణ వల్ల ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు వంతారా బృందం స్వయంగా హైదరాబాద్ జూలోని వసతులను, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, జంతువుల తరలింపునకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ప్రస్తుతం అక్కడి పునరావాస పనులు పూర్తయిన వెంటనే వీటిని నగరానికి తరలించనున్నారు.కంగారూలతో పాటు వాటిని పోలి ఉండే దాదాపు 3 అడుగుల ఎత్తు ఉండే వాలబీలు , మడగాస్కర్ ప్రాంతానికి చెందిన విశిష్టమైన రింగ్-టెయిల్డ్ లెమూర్లు జూ సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. నలుపు , తెలుపు చారల పొడవైన తోకలు కలిగిన ఈ లెమూర్లు ఉదయాన్నే శరీర వేడి కోసం చేతులు చాచి నిటారుగా కూర్చునే వినూత్న ప్రవర్తనకు ప్రసిద్ధి చెందాయి. వీటికి తోడుగా, జూలోని జీబ్రాల సంఖ్యను మరింత పెంచేందుకు మరో జత జీబ్రాలను కూడా వంతారా నుంచి తీసుకురానున్నారు. ప్రస్తుతం జూలో ఉన్న ముగ్గురు జీబ్రాలు రెండు మగ, ఒక ఆడ కూడా గతంలో వంతారా నుంచే తీసుకువచ్చారు. మరోవైపు, దేశంలో ఎల్ నినో ప్రభావం, పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతల నుంచి జూలో ని మూగజీవాలను కాపాడేందుకు జూ యాజమాన్యం ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న 2,178 జీవుల 498 క్షీరదాలు, 320 సరిసృపాలు, 8 ఉభయచరాలు , పక్షులు సంరక్షణ కోసం ఎన్‌క్లోజర్ల వద్ద వాటర్ స్ప్రింక్లర్లు, ఫాగర్లు, కూలర్లు , ఎయిర్ కండిషనర్లను ఏర్పాటు చేశారు. ఎండ వేడిమి నుంచి జంతువులకు ఉపశమనం కలిగిస్తూనే, కొత్త అతిథుల కోసం ప్రత్యేక వాతావరణాన్ని అధికారులు తీర్చిదిద్దుతున్నారు.కొత్తగా రానున్న ఈ విదేశీ వన్యప్రాణులతో నెహ్రూ జూలాజికల్ పార్క్ మరింత సందడిగా మారడంతో పాటు నగర పర్యాటకానికి పెద్ద ఎత్తున ఆకర్షణగా నిలవనుంది. జూ అధికారుల సమాచారం ప్రకారం.. వంతారా అధికారులతో మిగిలిన అధికారిక ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి, రాబోయే కొన్ని వారాల్లోనే ఈ కొత్త అరుదైన అతిథులను సాధారణ సందర్శకుల ప్రదర్శన కోసం అందుబాటులోకి తేనున్నారు.

ఎలినినో.. నిధులెలా..

హైదరాబాద్, అక్టోబరు 24, (న్యూస్ పల్స్)తెలంగాణలో ఎల్ నినో ప్రభావం కారణంగా సంభవించే తీవ్ర ప్రతికూల పరిస్థితులు, కరువు కాటకాలను తట్టుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు వ్యూహాలకు పదును పెడుతోంది. వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ రంగానికి జరిగే తీవ్ర నష్టం, తాగునీరు-సాగునీటి ఎద్దడి , గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదాన్ని గుర్తించిన సర్కార్.. తక్షణ సహాయక చర్యల కోసం సుమారు రూ. 10,000 కోట్లతో సమగ్ర ఉపశమన ప్రణాళికను సిద్ధం చేసింది. అయితే, ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రానికి నిర్దేశించిన అప్పుల పరిమితి దాదాపుగా పూర్తవ్వడంతో, ఈ అదనపు నిధుల సమీకరణ ప్రభుత్వానికి సవాలుగా మారింది.ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు నిధుల కొరత లేకుండా చూసేందుకు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి అత్యవసర లేఖ రాసింది. ఎల్ నినో వల్ల తలెత్తే కరువు పరిస్థితులు, పంట నష్టాలు , తాగునీటి ఎద్దడిని నివారించడానికి చేసే అత్యవసర ఖర్చులను సాధారణ బడ్జెట్ అప్పుల పరిమితి నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను, ఎఫ్ఆర్బీఎమ్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ప్రత్యేక మినహాయింపు కింద రూ. 10 వేల కోట్ల అదనపు అప్పులు తీసుకునేందుకు అనుమతించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరింది.ప్రస్తుతం ఉన్న అప్పుల పరిమితి తీరిపోవడంతో, ఈ అదనపు రుణాలు లభిస్తేనే బాధితులకు సమర్థవంతంగా సహాయక చర్యలు అందించే వెసులుబాటు ఏర్పడుతుంది. వ్యవసాయ రుణాల ఊరట, రైతులకు నష్టపరిహారం, ఉపాధి హామీ పథక విస్తరణ,సాగు నీటి యాజమాన్యం, పశుగ్రాసం సరఫరా వంటి ముందస్తు చర్యలకు ఈ నిధులను వెచ్చించాల్సి ఉందని లేఖలో సమగ్రంగా వివరించింది. కేంద్రం సానుకూలంగా స్పందించి రుణ పరిమితిని పెంచకపోతే, రాష్ట్ర బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం పడి సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు మందగించే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.మరోవైపు, వాతావరణ మార్పుల వంటి అనివార్య విపత్తుల సమయంలో కేంద్రం నిబంధనలను సడలించి రాష్ట్రాలకు తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎల్ నినో రూపంలో రాబోయే ముప్పును ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం చేసిన ఈ అభ్యర్థనపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటేనే తెలంగాణలో వర్షాభావ పరిస్థితుల నుంచి రైతాంగాన్ని, సామాన్య ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఉపశమన చర్యలు చేపట్టడానికి మార్గం సుగమమవుతుంది.

ఎమ్మెల్సీ ఎన్నికలు.. టీడీపీ దారెటు



నల్గొండ, అక్టోబరు 24(న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. 2027 మార్చిలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకోసం హడావిడి మొదలైపోయింది. ముఖ్యంగా నల్గొండ-వరంగల్-ఖమ్మం నియోజకవర్గం ఎన్నికపై ఎన్డీయే కూటమిలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మధ్య పొత్తు కొనసాగుతోంది. అయితే తెలంగాణలో మాత్రం ఈ పార్టీల మధ్య పొత్తు లేదు. ఈ స్థానంలో పోటీ చేసేందుకు ఆయా పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడంలో బిజీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తి రేపుతోంది.ఏపీలో కలిసి ప్రయాణిస్తున్న ఈ మూడు పార్టీల మధ్య సఖ్యత తెలంగాణ రాజకీయాల్లోనూ ప్రతిఫలిస్తుందా లేదా అనేదానిపై ఇప్పుడు సందిగ్ధత నెలకొంది. స్థానిక రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తెలంగాణలో ఇవన్నీ వేర్వేరుగా ఉంటున్నాయి. వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవాలని జనసేన ఇప్పటికే పావులు కదిపింది. ఆ పార్టీ తరఫున గడల శ్రీనివాసరావును అభ్యర్థిగా కూడా ప్రకటించేసింది. మరోవైపు, బీజేపీ కూడా ఈ స్థానంలో పోటీ పడేందుకు గట్టి పట్టుదలతో ఉంది. కాషాయ పార్టీ నుంచి పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంక?? బిక్షం గౌడ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.బీజేపీ, జనసేన రెండు పార్టీలు బరిలోకి దిగాలని నిశ్చయించుకోవడంతో కూటమిలో అసలు చిక్కు వచ్చిపడింది. ఈ నేపథ్యంలో తెలంగాణ టీడీపీ వైఖరి అత్యంత కీలకంగా మారింది. ఇక్కడ టీడీపీ మద్దతు ఎవరికి దక్కుతుందనే అంశం ఆసక్తి రేపుతోంది. తెలంగాణలో తనదైన క్యాడర్, ఓటు బ్యాంక్ కలిగి ఉన్న టీడీపీ మాత్రం ఇప్పటివరకు వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. బరిలోకి దిగే అవకాశాలు లేవు. అయితే మిత్రపక్షాల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై ఇంకా స్పష్టతనివ్వకుండా వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది.ఒకవేళ టీడీపీ గనుక ఒక పార్టీ వైపు మొగ్గుచూపితే, ఆ పార్టీ విజయావకాశాలు మెరుగవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అలా కాకుండా టీడీపీ కనుక తటస్థంగా ఉండి, సొంత బాటలో నడవాలని భావిస్తే మాత్రం కూటమి పార్టీల మధ్య ఓట్ల చీలిక తప్పకపోవచ్చు. ఏపీలో బలమైన బంధంలో ఉన్న ఈ పార్టీలు, తెలంగాణలో మాత్రం తమ స్థానిక ప్రయోజనాల కోసం భిన్నమైన వ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి.

ఇల్లెందు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో చేరికలు

కామేపల్లి మండలం కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లోకి 15 కుటుంబాలు

ఇల్లెందు, అక్టోబర్ 24 : ఇల్లెందు నియోజకవర్గం కామేపల్లి మండలం కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జి హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో గులాబీ పార్టీలో చేరారు. టేకులపల్లి మండలం దాసతండా హరిప్రియ నాయక్ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో మండల మాజీ అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య ఆధ్వర్యంలో కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు.

నీళ్లన్నీ వృధాగా పోతున్నయ్.. మేం కళ్లారా చూసినం : ఎమ్మెల్యే కేపీ వివేకానంద



హైదరాబాద్, కన్నెపల్లి పంప్ హౌసును బీఆర్ఎస్ నాయకుల బృందం పరిశీలించింది. ఇప్పటికైనా కన్నెపల్లి మోటర్లు ఆన్ చేసి గ్రేటర్ హైదరాబాద్ తాగునీటి సమస్య, రైతుల సాగునీటి సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద మీడియాతో మాట్లాడుతూ.. ఈ ముఖ్యమంత్రిని ఈ ప్రభుత్వాన్ని ఒకే ఒక్కటి హెచ్చరిస్తున్నా.. ఈ నీటి సమస్య జఠిలంగా మారి మీరు పరిష్కరించకపోతే హైదరాబాద్ నగర ప్రజలందరూ వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి దగ్గరే ఖాళీ కుండలు, ఖాళీ బిందెలతో ఇదే శాసనసభ్యులం ప్రజలందరితో కలిసి రేవంత్ రెడ్డి ఇంటి దగ్గర కూర్చుంటామని హెచ్చరిస్తున్నానన్నారు. చేతకాని దద్దమ్మ ఈ రోజు దద్దమ్మ రాజకీయాలు చేస్తున్నాడు. చీఫ్ పాలిటిక్స్ చేస్తున్నాడు.. ఇంకా కూడా కేసీఆర్ మీద దుమ్మెత్తి పోస్తున్నాడు. మీ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు అవుతోంది.. ఇంకా కూడా కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపైనా దుమ్మెత్తిపోయడమే తప్ప ఒక సమస్యకు పరిష్కారం చూపించే అడుగులేవి నీవి అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రశ్నించారు. పని చేసేటోడే లేడు.. ఇక్కడికెవరూ వచ్చేటోడే లేడు.. వచ్చి ఇసుకు ఎత్తుకొని పోయి అమ్ముకునేటోళ్లే తప్ప.. చిన్న రిపేర్ చేసేందుకు కిలో సిమెంట్ కూడా పెట్టింది లేదని అక్కడున్నవాళ్లు చెప్తున్నరు.స్థానికులను అడిగితే చిన్న సిమెంట్ కూడా పెట్టింది లేదు సార్.. నీళ్లన్నీ వృధా పోతున్నయ్. మీ కండ్ల ముందే పోతున్నయ్ చూడండి.. సార్ అంటే మేం దగ్గరుండి కళ్లారా చూసినం. కాబట్టి ఈ రోజుకూ కూడా అక్కడ రిపేర్ చేసేందుకు చర్యలు లేవు. ఈ భారతదేశంలో ఇలాంటి చవట, దద్దమ్మ ముఖ్యమంత్రి ఎవరూ లేకుండొచ్చు.. అలాంటి ముఖ్యమంత్రిఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నడు.. ప్రజలకు నరకయాతన చూపిస్తున్నడు.. ప్రజలను ఇబ్బంది పెడుతున్నడని మండిపడ్డారు. హైదరాబాద్‌లో మళ్లీ నీళ్ల ట్యాంకర్ల మాఫియా మొదలైంది. నీళ్లు లేవని, రైతులు పంటలు వేయవద్దంటూ రేవంత్ చేతగాని దద్దమ్మలా మాట్లాడుతున్నాడన్నారు. ఎల్‌నినో విపత్తుపై ఏడాది నుంచే నిపుణులు హెచ్చరించినా..మా బీఆర్ఎస్ పార్టీ ఎంతగా పోరాటం చేసినా.. కన్నెపల్లి పంపులు ఆన్ చేయకుండా, నీళ్లను తోడకుండా నిర్లక్ష్యం చేసి..ఇప్పుడేమో నీళ్లు లేవంటూ రేవంత్ తప్పించుకుంటున్నాడని ఫైర్ అయ్యారు.

మోరంపల్లిబంజర్‌లో ముమ్మరంగా పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన




బూర్గంపహాడ్, అక్టోబర్ 24 : ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు బూర్గంపహాడ్ మండలంలో బీఆర్ఎస్ నేతలు ముమ్మరంగా చేపడుతున్నారు. బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్, పీహెచ్‌సీలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందిని కలిసి అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదు చేయించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హులందరూ తమ ఓటును ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని సహ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.అదేవిధంగా పారిశ్రామికవాడ సారపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి అర్హత కలిగిన పట్టభద్రులు ఓటరు నమోదు చేయించుకుని ఓటు వేసే విధానంలో కీలకం కావాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మోరంపల్లిబంజర్ ఉప సర్పంచ్ పొక్కుల రవి, మాజీ వార్డు సభ్యులు పద్మ, బీసీ సెల్ అధ్యక్షులు చేతుల పెద్దవీర్రాజు, మూల బాలిరెడ్డి, కురుకుంట్ల చిన్నప్పరెడ్డి, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, సారపాక యూత్ నాయకులు సోము లక్ష్మిచైతన్యరెడ్డి, చల్లకోటి పూర్ణ, చట్ట ఆంజనేయులు, దాసరి మోహన్, పంగి సురేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో భూసేకరణపై ఉద్రిక్తత.. భారీగా పోలీసుల మోహరింపు

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని ఇందిరమ్మ టవర్స్ భూసేకరణ వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. సర్వే నంబర్ 255/1లో రైతుల భూముల వద్ద ప్రహరీ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేయడంతో పరిసర ప్రాంతాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇబ్రహీంపట్నం ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారులు భూసేకరణకు సన్నద్ధమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. గతంలో భూసేకరణకు వచ్చిన అధికారులు, పోలీసులను స్థానిక రైతులు వెనక్కి పంపిన నేపథ్యంలో ఈసారి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. భూములకు సంబంధించిన వివాదం నేపథ్యంలో సుమారు 20 మంది బాధిత రైతులతోపాటు బీఆర్ఎస్, బీజేపీ నేతలను హౌస్ అరెస్టు చేసినట్లు సమాచారం. పోలీసుల పహారాలో భూసేకరణ ప్రక్రియకు అధికారులు సిద్ధమవడంతో ఏం జరగనుందనే ఉత్కంఠ నెలకొంది.




కేరళ రాజ్ భవన్‌లో వెజ్ ఓన్లీ కిచెన్.. గవర్నర్ ఆదేశం.. మండిపడ్డ కాంగ్రెస్, సీపీఎం



కేరళ గవర్నర్‌గా ఓం ప్రకాష్ మాథుర్ ప్రమాణ స్వీకారం చేసి ఒక రోజు కూడా గడవక ముందే వివాదంలో చిక్కుకున్నారు. గవర్నర్ అధికారిక నివాసమైన రాజ్‌భవన్‌లో శాకాహార వంటశాల (వెజ్ ఓన్లీ కిచెన్) మాత్రమే ఉండాలంటూ ఆయన తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ, సీపీఎం మండిపడుతున్నాయి. ఓం ప్రకాష్ మాథుర్ కేరళ గవర్నర్‌గా శుక్రవారమే ప్రమాణ స్వీకారం చేశారు. అదే రోజు ఆయన తన రాజ్ భవన్‌లో శాకాహార వంటశాల మాత్రమే ఉండాలంటూ ఆదేశించారు.మాంసాహారాన్ని వండటం కానీ, వడ్డించడం కానీ చేయకూడదని ఆదేశించారు. అయితే, ఈ నిర్ణయంపై కేరళ కాంగ్రెస్ పార్టీతోపాటు, సీపీఎం, వివిధ కేరళ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఆహారపు అలవాట్ల విషయంలో వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కును హరించేలా గవర్నర్ నిర్ణయం ఉందంటూ విమర్శిస్తున్నాయి. ఈ అంశంపై కేరళకు చెందిన కాంగ్రెస్ అగ్రనేత, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కేసే వేణుగోపాల్ స్పందించారు. కేరళ గవర్నర్ వ్యక్తిగత ఆహారపు అలవాట్లు, అభిరుచుల్ని అందరికీ వర్తించేలా చేయడం సరికాదన్నారు. కేరళకు ఉన్న తీర ప్రాంతం దృష్ట్యా ప్రజలు చేపల్ని ఎక్కువగా తింటారని, భిన్నమైన ఆహార అలవాట్లు కలిగి ఉంటారని అన్నారు.ప్రజలు తమకు నచ్చింది తినే హక్కు కలిగి ఉన్నారని చెప్పారు. ప్రజల ఆహారపు అలవాట్లను నిషేధించే చర్యల్ని ఆమోదించబోమన్నారు. గవర్నర్ తన పదవిని ప్రజల హక్కుల రక్షణ కోసం వాడుకోకుండా.. సొంత ప్రయోజనాలకు వాడుకోవడం సరికాదని, ఈ నిర్ణయం ప్రజల ప్రాథమిక హక్కుల్ని హరించడమే అన్నారు. అయితే, ఈ అంశంపై కేరళ రాజ్‌భవన్ వర్గాలు వివరణ ఇచ్చాయి. గవర్నర్ ఆదేశాలు ఆయన కోసం సిద్ధం చేసే ఆహార పదార్థాలకు మాత్రమే వర్తిస్తుందని, కార్యాలయ సిబ్బందికి కాదని వివరించింది.

నిరసనలను వాయిదా వేయండి.. రాహుల్ గాంధీకి ఢిల్లీ వ్యాపారుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ , భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి తలపెట్టనున్న నిరసన కార్యక్రమాలను వాయిదా వేయాలని కోరుతూ ఢిల్లీ వ్యాపారులు.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. పండగ సీజన్‌లో ఈ ఆందోళనలు నిర్వహించడం వల్ల తమకు అక్షరాలా పది వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు వ్యాపారుల తరఫున ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ).. నిరసనలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది.భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు నిరసనకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.



అయితే దీపావళి పండగ సమీపిస్తున్న వేళ.. ఈ నిరసనలు వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని సీటీఐ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీపావళి షాపింగ్ కోసం ప్రజలు దేశం నలుమూలల నుంచి ఢిల్లీకి వస్తారని, ఇక్కడ రూ.25 వేల కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని చెబుతోంది. అయితే పండగ సీజన్‌లో ఇలాంటి కార్యక్రమాల కారణంగా తమకు రూ.10,000 కోట్ల వరకు నష్టం వస్తుందని ఆవేదన చెందుతోంది. ఇప్పటికే అక్టోబర్‌లో జరిగిన నిరసనల వల్ల వ్యాపారులకు రూ.3000 కోట్ల మేర నష్టాలు వచ్చాయని వాపోయింది. అందుకే సీఈసీ వ్యతిరేక ర్యాలీని వాయిదా వేయాలని వర్తక సంఘం కోరింది.నవంబర్ 1న నిరసనలు నిర్వహిస్తే రామ్‌లీలా మైదానం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, బారికేడ్లు, మెట్రో స్టేషన్ల మూసివేత వంటి చర్యలు ఉంటాయని, ఇవి వ్యాపారాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ తెలిపారు. అందుకే ఈ కార్యక్రమాలను నవంబర్ 10 తరువాత చేపట్టాలని రాహుల్ గాంధీని కోరారు.

జైష్ సంస్థతో సంబంధాలు.. ముంబైలో ఒకరి అరెస్ట్

ముంబై, అక్టోబర్ 24: పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైష్ -ఎ- మొహమ్మద్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణల కారణంగా ముంబైలో మహమ్మద్ హసన్ అబు సర్మాద్ అక్తర్ (33)ను మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దళం అరెస్ట్ చేసింది. నగరంలోని మహిమ్ ప్రాంతంలో అతడిని శనివారం అదుపులోకి తీసుకుంది. అనంతరం అతడిని విచారిస్తోంది. పాక్ ఐఎస్ఐకు చెందిన వారితో ఉన్న సంబంధాలపై అతడిని విచారిస్తుంది. అతడి సెల్ ఫోన్‌ను పరిశీలించగా.. పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.జైష్-ఎ- మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు సంబంధించిన రెచ్చగొట్టే ఆడియో క్లిప్‌లతోపాటు సోషల్ మీడియా పోస్టులను వారు గుర్తించారు. దీంతో ఏటీఎస్ కలాచౌక్ యూనిట్‌లో అతడిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సోషల్ మీడియా కార్యకలాపాలతోపాటు టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా సర్మాద్ అక్తర్ కేసు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.మరో వైపు



గతంలో గుజరాత్‌లో జైష్ -ఎ- మొహమ్మద్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిన ఎనిమిది మందిని ఉగ్రవాద వ్యతిరేక దళం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆ రాష్ట్రంలో వారంతా ఈ ఆ సంస్థ కోసం చురుకైన పాత్ర పోషించడంతోపాటు సభ్యులను నియమించేందుకు నెట్ వర్క్‌ను చేపట్టారు. ఆ రాష్ట్రంలో భావజాలాన్ని వారి ద్వారా వ్యాప్తి చేయడానికి వీరంతా పని చేస్తున్నారని ఉగ్రవాద వ్యతిరేక దళం వెల్లడించిన విషయం విదితమే. అందుకోసం దారుల్ ఇస్లాం గుజరాత్ జైష్ ఎ మొహమ్మద్ అనే సంస్థను వారు స్థాపించారని ఏటీఎస్ వివరించింది. ఈ ఎనిమిది మందిలో ఏడుగురు గుజరాతీలు కాగా.. ఒకరు మధ్యప్రదేశ్‌కు చెందిన వారని ఏటీఎస్ స్పష్టం చేసిన విషయం విదితమే.

ఫిలిప్పైన్స్‌లో రెండు సైనిక విమానాలు ఢీ.. నలుగురు పైలట్లు మృతి

ఫిలిప్పైన్స్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఫిలిప్పైన్స్ సైన్యానికి చెందిన రెండు శిక్షణ విమానాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు పైలట్లు మరణించారు. ఈ ఘటన ఫిలిప్పైన్స్ రాజధాని మనీలా దక్షిణ ప్రాంతంలో ఉన్న ఎయిర్ బేస్ వద్ద శుక్రవారం జరిగింది. స్థానిక బటాంగాస్ ప్రావిన్స్‌లోని ఫెర్నాండో ఎయిర్ బేస్ సమీపంలో ఎస్ఎఫ్-260 అనే రెండు యుద్ధ విమానాలు గాలిలోనే ఢీకొన్నాయి. ఈ సమయంలో రెండు విమానాల్లో ఉన్న నలుగురు పైలట్లు మరణించారు.విమానాలు ఢీకొని ఎయిర్ బేస్ ప్రాంతంలోనే కూలిపోయాయి. ఘటన గురించి తెలిసిన వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. పైలట్ల మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నాయి. ఈ విమానాలు పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు వాడుతారు. ఈ ఘటన తర్వాత ఎస్ఎఫ్-260 యుద్ధ విమానాల్ని ఫిలిప్పైన్స్ ఎయిర్ ఫోర్స్ విభాగం నిలిపివేసింది. తాత్కాలికంగా విమాన సేవల్ని నిలిపివేసినట్లు తెలిపింది. విమాన ప్రమాదంపై విచారణ జరుగుతోందని సైనిక విభాగం వెల్లడించింది. విమానాలు ఢీకొనడానికి గల కారణాలపై దర్యాప్తు బృందం విచారణ జరుపుతోందని వివరించింది.ఈ ఘటనకు సంబంధించి పైలట్లు శిక్షణలో ఉన్నారని, వారు మరణించడం విచారకరమని వ్యాఖ్యానించింది. ఎస్ఎఫ్-260 యుద్ధ విమానాలు గతంలో కూడా ప్రమాదాలకు గురయ్యాయి. గత మేలో ఎస్ఎఫ్-260 యుద్ధ విమానం కూలిన ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. అంతకుముందు 2023లో కూడా ఎస్ఎఫ్-260 టీపీ మార్చెట్టి అనే విమానం కూడా కూలిపోయింది.



ఇరాన్‌పై మళ్లీ సైనికచర్య తప్పదన్న ట్రంప్.. నిప్పుతో చెలగాటమొద్దన్న ఇరాన్..!



పశ్చిమాసియా లో ఉద్రిక్తలు మళ్లీ తీవ్రస్థాయికి చేరేలా కనిపిస్తున్నాయి. ఈ వారాంతంలో ఇరాన్ పై అమెరికా భీకర దాడులు చేసే అవకాశాలున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. టెహ్రాన్ తో ఎలాంటి ఒప్పందం కుదరకపోతే తాము మరోసారి సైనికచర్యకు దిగే అవకాశం ఉందని ట్రంప్ సంకేతాలిచ్చారు. మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫ్లోరిడా ర్యాలీ లో మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'పశ్చిమాసియాలో మరో చిన్నస్థాయి ఎపిక్ ఫ్యూరీ జరగొచ్చు' అని ట్రంప్ ఆ ర్యాలీ సందర్భంగా హెచ్చరించారు. ఈ వారాంతంలో ఇరాన్‌పై దాడులు జరిగే అవకాశం ఉందని తుర్కియేలోని అమెరికా రాయబారి టామ్ బారక్ ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యలు చేశారు. తొలుత వాటిని ట్రంప్ తోసిపుచ్చారు. ఆ దాడుల వ్యాఖ్యల గురించి తనకేమీ తెలియదని వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు స్వయంగా ట్రంప్ కూడా దాడుల గురించి హింట్ ఇవ్వడం గమనార్హం. దాంతో పశ్చిమాసియాలో మళ్లీ పరిస్థితులు ఉత్కంఠగా మారాయి.కాగా అమెరికా హెచ్చరికల వార్తలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. నిప్పుతో చెలగాటమాడొద్దంటూ వార్నింగ్ ఇచ్చింది. తమపై మరోసారి దాడులు జరిగితే గల్ఫ్ దేశాల్లోని సముద్రగర్భంలో ఉన్న కమ్యూనికేషన్ కేబుళ్లను ధ్వంసం చేస్తామని ఇప్పటికే వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్‌పై దాడి జరిగితే ఇక ఎలాంటి హద్దులు ఉండవని.. కేబుళ్లు, మిలిటరీ స్థావరాలు వేటినీ వదలబోమని పేర్కొన్నది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరిట అమెరికా దాడులు చేసింది. అప్పటి నుంచి పశ్చిమాసియాలో ఏదో ఒక రూపంలో ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి.

రైతులతో కలిసి ఎండిన వరి పంటతో సునీత లక్ష్మారెడ్డి ధర్నా



వెల్దుర్తి, అక్టోబర్ 24 : విద్యుత్ సమస్యలతో ఎండిపోతున్న వరి పంటలను చూసి రైతుల కష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని మాసాయిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఎండిన వరి పంటను పరిశీలించిన ఎమ్మెల్యే.. బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని బ్లాక్ బుక్స్‌ను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరిశీలించారు. విద్యుత్ సరఫరా, అంతరాయాలకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. విద్యుత్ సమస్యల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నాయకులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనతో రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

అభిజీత్ దీప్కే లాంటి వాళ్లు వస్తారు.. సీజేపై నేతపై పీయూష్ గోయల్ వ్యాఖ్యలు..




విదేశాల్లో ఉన్న భారతీయ ప్రతిభావంతులను స్వదేశానికి తిరిగి రప్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. జర్మనీలోని బెర్లిన్‌లో భారతీయ పరిశోధకులు, విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిధులతో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించే అంశాన్ని ప్రస్తావిస్తూ, సీజేపీ నేత అభిజీత్ దీప్కే పేరును ప్రస్తావించారు విదేశాల్లో ఉన్న ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, పరిశోధకులను తిరిగి స్వదేశానికి రప్పించేందుకు చైనా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని పీయూష్ గోయల్ వివరించారు. భారతదేశం కూడా అలాంటి కార్యక్రమాలను పరిశీలించవచ్చని, అయితే ప్రజాస్వామ్య వ్యవస్థలో వాటిని అమలు చేసేటప్పుడు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

ఎన్నికల వివాదాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

విజయవాడ, అక్టోబరు 24 ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనూహ్యమైన రాజకీయ, చట్టపరమైన సమీకరణాలు వెలుగులోకి వస్తున్నాయి. స్థానిక పోరులో నామినేషన్ల ఘట్టం నుంచి మొదలైన వివాదం ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం వరకు చేరినప్పటికీ.. అధికార కూటమి, పొలిటికల్ సర్కిళ్లలో మరో ఆసక్తికరమైన ప్రచారం నడుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నామినేషన్లను అడ్డుకున్నారు అనే ప్రచారాన్ని ఉద్దేశపూర్వకంగానే తీవ్రతరం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల బహిష్కరణ ప్రకటన వచ్చేలా మానసిక వాతావరణాన్ని సిద్ధం చేసుకుంటోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని పలు సమస్యాత్మక కేంద్రాలు, మున్సిపాలిటీలలో స్థానిక అధికారులు , పోలీసులు తీసుకుంటున్న భద్రతా చర్యలే. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, అనవసర ఘర్షణలను నివారించేందుకు పోలీసులు నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి, సంబంధిత అభ్యర్థులు, ప్రతిపాదకులను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. అయితే, వైసీపీకి చెందిన కొందరు ముఖ్యనేతలు తమ అనుచరగణంతో భారీ రాలీలుగా నామినేషన్ కేంద్రాల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు పోలీసులు అడ్డుకోవడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమే. కానీ, దీన్నే పక్కాగా తమకు అనుకూలంగా మలుచుకుని మా నేతలను పోలీసులు దగ్గరుండి అడ్డుకుంటున్నారు, నామినేషన్లు వేయనివ్వడం లేదు అని వైసీపీ డిజిటల్ స్పేస్‌లో ముమ్మర ప్రచారం నిర్వహిస్తోందనేది టీడీపీ నేతల ఆరోపణ. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత వైసీపీ క్షేత్రస్థాయి యంత్రాంగం , ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్రమైన నైరాశ్యంలో కూరుకుపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోతే, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మిగిలి ఉన్న కొద్దిపాటి ఉనికి కూడా తుడిచిపెట్టుకుపోతుందనే భయం నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో పోటీ చేసి ఓడిపోవడం కంటే.. ప్రభుత్వ అరాచకాలకు నిరసనగా ఎన్నికలను బహిష్కరించాం అనే నరేటివ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడమే పార్టీ ప్రతిష్టకు క్షేమకరమని వైసీపీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు పొలిటికల్ టాక్ నడుస్తోంది. మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియను వీలైనంత వివాదాస్పదం చేయడం ద్వారా తమ బహిష్కరణ నిర్ణయానికి పునాది వేసుకునే ప్రయత్నం సాగుతోందని తెలుస్తోంది. నామినేషన్లలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించడం, ఆరోపణలను మీడియా వేదికగా నిరంతరం పబ్లిసిటీ చేయడం ద్వారా.. ఎన్నికల యంత్రాంగం , పోలీసులు కూటమికి కొమ్ముకాస్తున్నారు, ఇలాంటి వాతావరణంలో ఎన్నికలు ప్రహసనంగా మారాయి అనే అభిప్రాయాన్ని బలంగా నాటాలని యత్నిస్తున్నారు. మా అభ్యర్థుల ప్రాణాలకు రక్షణ లేదు, అందుకే మేము ఈ ప్రజాస్వామ్య రహిత ఎన్నికలను బహిష్కరిస్తున్నాం అని బాహాటంగా ప్రకటించడానికి పార్టీకి ఒక బలమైన సాకు దొరుకుతుందని భావిస్తున్నారు.తమకు ప్రజా మద్దతు ఉందని, కానీ అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతూ, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, అభ్యర్థులను భౌతికంగా అడ్డుకోవడం వల్లే తాము న్యాయపోరాటం చేయాల్సి వస్తోందని వారు వాదిస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా నామినేషన్ల ప్రక్రియను సమీక్షించి గడువు పెంపును పరిశీలించాలని సూచించడమే తమ ఆరోపణలకు నిదర్శనమని వారు స్పష్టం చేస్తున్నారు. స్థానిక పోరులో సాగుతున్న ఈ యుద్ధం రాబోయే రోజుల్లో మరింత ఆసక్తికరంగా మారనుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఈసీ , పోలీసులు ఎంతటి పటిష్ట భద్రత కల్పించినా, ఒకవేళ వైసీపీ నిజంగానే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను బహిష్కరిస్తే.. అది రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రగడకు దారితీస్తుంది. నామినేషన్ల గడువు సమీపిస్తున్న కొద్దీ వైసీపీ వ్యూహం బహిష్కరణ వైపా లేక పూర్తిస్థాయి పోరాటం వైపా అనేది తేలిపోనుంది.

లోకల్ బాడీ ఎన్నికల్లో పతాక స్థాయికి ఘర్షణలు

కర్నూలు అక్టోబరు 24 ,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల దశలోనే అభ్యర్థులను అడ్డుకోవడం, పత్రాలను బలవంతంగా లాక్కొని చించేయడం, పరస్పరం దాడులకు దిగడం వంటి ఘటనలు కలవరపెడుతున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటుండటంతో అసలు తప్పు ఎవరిదన్నది తేల్చడం కష్టంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు కూడా ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగినట్లు చూపిస్తున్నాయి.ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడం అధికారుల బాధ్యత. అలాంటి ప్రక్రియలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను టీడీపీ వర్గీయులు లాక్కొని చించేశారన్న వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. మరోవైపు వైసీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థులపైనా దాడులు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనల్లో ఎవరు బాధితులు, ఎవరు బాధ్యులు అనే అంశాన్ని రాజకీయ వాదనల ఆధారంగా కాకుండా పూర్తి ఆధారాలతో నిర్ధారించాల్సిన అవసరం ఉంది.వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త రామకృష్ణారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 76 హింసాత్మక ఘటనలు జరిగినట్లు ఆ పార్టీ ఆరోపించింది. వీటిలో వైఎస్సార్ కడప జిల్లాలో 22, పల్నాడులో 18, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో కలిపి 11 ఘటనలు ఉన్నట్లు పేర్కొంది. అయితే ఈ ఆరోపణలను టీడీపీ ఖండిస్తోంది. ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ అనవసర వివాదాలు సృష్టిస్తోందని, ఎన్నికలను వాయిదా వేయించేందుకు ప్రయత్నిస్తోందని అధికార పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. పెనుకొండ, కడప , చిత్తూరు , శ్రీకాళహస్తి , పులివెందుల వంటి ప్రాంతాల్లో నామినేషన్ల విషయంలో వివాదాలు



చోటుచేసుకున్నట్లు ప్రచారంలో ఉన్న వీడియోలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. మరోవైపు పుంగనూరు పరిధిలోని సదుం, రాయచోటి, మాచర్ల ప్రాంతాల్లో టీడీపీ నేతలు, అభ్యర్థులపై దాడులు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. చిత్తూరులో వాకర్ సాయంతో నామినేషన్ వేసేందుకు వెళుతున్న టీడీపీ మహిళా అభ్యర్థి అరుణకు ఎదురైన పరిస్థితికి సంబంధించిన వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కర్నూలు, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో వైసీపీ శ్రేణులు టీడీపీ అభ్యర్థులను అడ్డుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అదే సమయంలో పల్నాడు, మార్కాపురం, తిరుపతి ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులకు నామినేషన్ల విషయంలో ఆటంకాలు ఎదురైనట్లు ప్రచారం జరిగింది. కొన్ని ఘటనల్లో వాహనాలు ధ్వంసం కాగా, పోలీసు సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. జనసేన కార్యకర్తలపైనా కొన్ని చోట్ల వైసీపీ అభ్యర్థులను అడ్డుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి.ఈ పరిణామాలతో పోలీసుల వ్యవహారశైలిపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలంగా వ్యవహరించడం లేదని ఇరు పార్టీల నేతలు పరస్పరం ఆరోపించుకుంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నె కొత్తపల్లిలో నామినేషన్ కేంద్రం వద్ద అభ్యర్థులను అనుమతించే విషయంలో వివాదం తలెత్తినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో కొందరికి గాయాలైనట్లు కూడా పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పూర్తి వివరాలు, అధికారిక నిర్ధారణ అవసరం. మొత్తంగా చూస్తే, స్థానిక ఎన్నికలు రాజకీయ ఆధిపత్య పోరుకు వేదికగా మారుతున్నాయి. ఏ పార్టీకి బలం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఏ పార్టీకి చెందిన వారైనా నామినేషన్లను అడ్డుకోవడం, దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమే. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి అభ్యర్థికి స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడమే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే మార్గం.

పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల పర్వం

పోటాపోటీగా నామినేషన్లు వేసిన ఎంపీటీసీ అభ్యర్థులు.

మండల వ్యాప్తంగా 77 నామినేషన్లు దాఖలు.

తుగ్గలి: తుగ్గలి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మూడవ రోజు పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ప్రారంభమైంది. నామినేషన్లకు చివరి రోజు అయిన మూడవ రోజున మండల వ్యాప్తంగా మొత్తం 19 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శేషయ్య తెలిపారు.ఇందులో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు 05 మంది,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 10 మంది,ఒక జనసేన అభ్యర్థి,03 సిపిఐ అభ్యర్థులు ఉన్నారనీ రిటర్నింగ్ అధికారి తెలియజేశారు.ఉదయం నుంచే నామినేషన్ కేంద్రానికి అభ్యర్థులు తమ అనుచరులతో తరలివచ్చి నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీల మద్దతుదారుల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లుగా నామినేషన్లు కొనసాగాయి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.300 మీటర్ల పరిధిలోపు ఎంపీటీసీ అభ్యర్థులను మరియు బలపరిచే వ్యక్తులను తప్ప ఎవరిని అనుమతించలేదు.నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని,ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్లను పరిశీలిస్తామని రిటర్నింగ్ అధికారి శేషయ్య తెలిపారు.నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు అడిషనల్ ఎస్పి కృష్ణమోహన్ అటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ రూరల్ సీఐ పెద్దయ్య నాయుడు, తుగ్గలి ఎస్సై బాల నరసింహులు, జొన్నగిరి ఎస్సై మల్లికార్జున లు తమ పోలీస్ సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ విశ్వ మోహన్,రవి తదితరులు పాల్గొన్నారు.

నందవరం మండలంలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ

నందవరంమండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలో ఎంపీటీసీ 17 స్థానాలుకు గాను మొత్తం 95 నామినేషన్లు తెలుగుదేశం పార్టీ వైయస్సార్ పార్టీ ,జనసేన పార్టీ , బిజెపి, స్వతంత్ర అభ్యర్థి , కాంగ్రెస్ పార్టీ ,సిపిఐ సిపిఎం దాఖలైనట్లు సమాచారం.నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రక్రియ ముగిసింది.ఎన్నికల బరిలో నిలిచేందుకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు.నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో తదుపరి ఎన్నికల కార్యక్రమాలపై అభ్యర్థులు,రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

నామినేషన్ కేంద్రాల్లో పటిష్ట చర్యలు

రాయచోటి, అన్నమయ్య జిల్లా పరిధిలోని కలకడ, సంబేపల్లి, ఎల్.ఆర్.పల్లి, రామాపురం, గాలివీడు మండలాల్లో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సంబంధిత అధికారులు, పోలీసు అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటితో ముగియనున్న నేపథ్యంలో రామాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లు, కేంద్రం వద్ద భద్రతా చర్యలను సమీక్షించారు.నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారం, పూర్తి పారదర్శకతతో, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు కొనసాగించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని పోలీసు సిబ్బందికి సూచించారు.ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.అన్నమయ్య జిల్లాలో రెండో సాధారణ ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి, నామినేషన్లు దాఖలు చేయకుండా ఎవరైనా తమను అడ్డుకున్నట్లు భావించే వ్యక్తులు, తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదులను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శుక్రవారం కోరారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నేడు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు. నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేసినట్లయితే, సంబంధిత అధికారులు ఆ ఫిర్యాదులను పరిశీలించి, ఫిర్యాదుదారులను వెంటనే ఫోన్ ద్వారా సంప్రదించి, నిర్దేశిత గడువు సాయంత్రం 5.00 గంటలలోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సహకారం అందించాల్సి ఉంటుందని తెలిపారు.కంట్రోల్ రూమ్ నెంబర్ 08571-293001 ఫోన్ చేయాలని వివరించారు.

బేకరీలు, స్వీట్ షాపుల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

నిల్వ ఉన్న ఆహార పదార్థాల సీకరణ

ల్యాబ్ పరీక్షల అనంతరం చర్యలు

నాణ్యత లేని, కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

తాండూర్:తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ ప్రాంతంలో ఉన్న బేకరీలు, స్వీట్ షాపుల్లో శుక్రవారం మంచిర్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి జి. మహేష్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేకరీల తయారీ కేంద్రాలను పరిశీలించి, అక్కడ నిల్వ ఉన్న ఆహార పదార్థాలను సేకరించారు. సేకరించిన నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలలకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.ల్యాబ్ పరీక్షల నివేదికలు వచ్చిన అనంతరం నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన బేకరీలు, స్వీట్ షాపులపై తగిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి జి. మహేష్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేకరీల నిర్వాహకులు, యజమానులు నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే తయారు చేసి విక్రయించాలని సూచించారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయడంతో పాటు, వాటి నాణ్యత, నిల్వ కాలం విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయించడం, నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు కలిగించే విధంగా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత దుకాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టూ టైర్ సిటీస్ లోకి క్విక్ కామర్స్

కర్నూలు, అక్టోబరు 24 ఇ-కామర్స్ సేవలు వేగంగా విస్తరిస్తుండటం, క్విక్ కామర్స్ సంస్థల మధ్య పోటీ పెరగడంతో ప్రముఖ లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ దిగ్గజాలు తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. కేవలం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై వంటి మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల సరిహద్దుల్లో భారీగా భూములను సమీకరించే పనిలో పడ్డాయి. జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న వ్యూహాత్మక ప్రాంతాల్లో వందలాది ఎకరాలను సుదీర్ఘ కాలానికి లీజుకు తీసుకోవడం లేదా డెవలప్‌మెంట్ ఒప్పందాలు కుదుర్చుకోవడం గత వారంలో గణనీయంగా పెరిగింది.ఈ నూతన ధోరణిలో ప్రధానంగా జాతీయ రహదారుల జంక్షన్లు, ఇండస్ట్రియల్ కారిడార్లు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. వరంగల్, కరీంనగర్, నల్గొండ, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు వంటి ప్రధాన పట్టణాల బైపాస్ రోడ్లకు సమీపంలో ఉన్న ల్యాండ్ పార్సెల్స్‌కు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. పక్కా రవాణా సదుపాయాలు, తక్కువ ధరకే లభించే భూమి, చౌకగా లభించే స్థానిక కార్మికులు ఈ నగరాల వైపు గ్లోబల్ లాజిస్టిక్స్ సంస్థలను ఆకర్షించడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.టైర్-2, టైర్-3 ప్రాంతాల్లో నివసించే వినియోగదారులకు కూడా సేమ్ డే డెలివరీ, దా కొన్ని గంటల వ్యవధిలోనే సరుకులను అందజేయాలనే లక్ష్యంతో కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇక్కడ ప్రాంతీయ పంపిణీ కేంద్రాలను , గ్రేడ్-ఎ వేర్‌హౌసింగ్ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా సప్లై చైన్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని లాజిస్టిక్స్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. దీనివల్ల వస్తువుల రవాణా మరింత వేగవంతం కానుంది.వేర్‌హౌసింగ్ దిగ్గజాల నుంచి వస్తున్న ఈ భారీ డిమాండ్ కారణంగా టైర్-2, టైర్-3 నగరాల సరిహద్దుల్లో ఉన్న భూముల విలువలు ఒక్కసారిగా రెక్కలు తొడిగాయి. ఒకప్పుడు కేవలం వ్యవసాయానికే పరిమితమైన హైవే పక్క భూములకు ఇప్పుడు కమర్షియల్ లీజుల రూపంలో స్థానిక భూయజమానులకు భారీగా క్రమం తప్పని ఆదాయం సమకూరుతోంది. ఈ పరిణామం ద్వితీయ శ్రేణి నగరాల్లో స్థానిక ఉపాధి అవకాశాలను పెంచడమే కాకుండా, ఆ ప్రాంతాల రియల్ ఎస్టేట్ ముఖచిత్రాన్ని వేగంగా మార్చివేస్తోందని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

టీడీపీ కంటే వైసీపీ ఎక్కువ నామినేషన్లు

నెల్లూరు, అక్టోబరు 24 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదంటూ వైఎస్సార్‌సీపీ చేస్తున్న దుష్ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఎన్నికల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధికార కూటమి అడ్డంకులు సృష్టిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని గగ్గోలు పెడుతున్న జగన్ నాటకాలను అధికారిక లెక్కలే బట్టబయలు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా దాఖలైన నామినేషన్ల సంఖ్యను పరిశీలిస్తే, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏ స్థాయిలో పోటీలో ఉన్నారో, కొన్నిచోట్ల కూటమి కంటే ఎక్కువ సంఖ్యలోనే నామినేషన్లు వేసి హోరాహోరీగా రేసులో నిలిచారో స్పష్టమవుతోంది.రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 9,829 ఎంపీటీసీ స్థానాలకు గానూ మొత్తం 32,095 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకంగా 12,419 నామినేషన్లు వేయగా, తెలుగుదేశం పార్టీ తరఫున 15,017 మంది నామినేషన్లు సమర్పించారు. జనసేన నుంచి 2,073, బీజేపీ నుంచి 562 నామినేషన్లు వచ్చాయి. ఇక జెడ్పీటీసీల విషయానికొస్తే.. 659 స్థానాలకు మొత్తం 2,805 నామినేషన్లు పడగా, వైఎస్సార్‌సీపీ నుంచి అత్యధికంగా 1,092 మంది పోటీలో నిలిచారు. అధికార టీడీపీ తరఫున 1,055 మంది మాత్రమే నామినేషన్లు వేయగా, జనసేన నుంచి 178, బీజేపీ నుంచి 111 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధాన స్థానాల్లో టీడీపీ కంటే వైఎస్సార్‌సీపీ నేతలే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేయడం వారి ఫేక్ ప్రచారాన్ని బట్టబయలు చేసింది.తమ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అక్రమాలను, దౌర్జన్యాలను గుర్తుచేసుకుంటూ ఇప్పుడు అధికార కూటమిపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2020లో జరిగిన పట్టణ, గ్రామీణ స్థానిక పోరులో వైఎస్సార్‌సీపీ బలవంతపు ఏకగ్రీవాలతో రికార్డు సృష్టించింది. నాడు పట్టణ ప్రాంతాల్లో 20.72 శాతం స్థానాలను ఏకగ్రీవం చేసుకోగా, గ్రామీణ ప్రాంతాల్లో 24 శాతం ఎంపీటీసీలు, 19 శాతం జెడ్పీటీసీలను ప్రతిపక్షాలను బెదిరించి, భయాందోళనలకు గురిచేసి బలవంతంగా చేజిక్కించుకున్నారు. నాడు జరిగిన విధ్వంసాలు, దాడులతో గొడవలు సృష్టించి సాధించిన ఏకగ్రీవాలనే తమ గొప్ప విజయాలుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం చేసుకుంది.కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్నాయి. ప్రతిపక్ష అభ్యర్థులకు పూర్తి స్వేచ్ఛ ఉండటం వల్లే భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు కావడం సాధ్యమైంది. వైఎస్సార్‌సీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే కెమెరాల ముందు నాటకాలు ఆడుతూ, ఫేక్ వీడియోలతో నేషనల్ మీడియాను, ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారనేది ఈ అధికారిక గణాంకాలతో స్పష్టంగా నిరూపణైంది. ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ వర్గం ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్ముకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బొత్స రూటే వేరు...

విజయనగరం. అక్టోబరు 25,ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కీలక కేంద్రమైన విజయనగరం జిల్లా పరిషత్ పీఠాన్ని దక్కించుకునేందుకు బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్థానాన్ని ఎలాగైనా తమ ఖాతాలోనే ఉంచుకోవాలనే పట్టుదలతో, బొత్స తన సొంత కుటుంబ సభ్యులనే రేసులో నిలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 27 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో ప్రధానమైన నాలుగు కీలక నియోజకవర్గాల నుంచి తన కుటుంబీకులతో నామినేషన్లు వేయించారు.జెడ్పీ పీఠంపై కుటుంబ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు బొత్స సత్యనారాయణ పక్కా ప్రణాళికతో అభ్యర్థులను ఖరారు చేశారు. బొండపల్లి జెడ్పీటీసీ స్థానం నుంచి ఆయన కుమార్తె, భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ బొత్స అనూష నామినేషన్ దాఖలు చేశారు.అలాగే గరివిడి నుంచి కోడలు బొత్స పూజిత, గుర్ల స్థానం నుంచి సోదరి వెంకటలక్ష్మి, పూసపాటిరేగ జెడ్పీటీసీ స్థానం నుంచి సోదరుడి కుమారుడు బొత్స చైతన్య బరిలోకి దిగారు. ప్రధానంగా జెడ్పీ చైర్‌పర్సన్ స్థానానికి బొత్స అనూషను రేసులో నిలిపేందుకే ఈ ముందస్తు ఏర్పాటు చేశారనే ప్రచారం బలంగా జరుగుతోంది.జిల్లా పరిషత్ పీఠం చేజారకుండా చూసుకునేందుకే బొత్స కుటుంబం నాలుగు వైపుల నుంచి వ్యూహాత్మకంగా రంగంలోకి దిగినట్లు స్పష్టమవుతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ జెడ్పీ చైర్మన్‌గా వ్యవహరించిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసి అధికార కూటమిలోకి వెళ్లడం వైఎస్సార్‌సీపీకి పెద్ద షాక్‌గా మారింది.

స్పోర్ట్స్ న్యూస్

భారత జట్టులోకి కుమార్ కుశాగ్రా.. ఇషాన్ కిషన్ స్థానంలో..



న్యూజిలాండ్‌తో జరగనున్న రెండో టీ20 మ్యాచ్‌కు ముందు టీమిండియాకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. తొలి టీ20 మ్యాచ్‌లో తొడ కండరాల నొప్పి కారణంగా యంగ్ ప్లేయర్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం బీసీసీఐ వెద్య బృందం అతడిని పర్యవేక్షిస్తుందని బోర్డు కార్యదర్శి దేవాజిత్ సైకియా తెలిపారు. మరోవైపు ఇషాన్‌కి ప్రత్యామ్నాయంగా యంగ్ వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుశాగ్రా టీమిండియాలోకి ఎంపికయ్యాడు.ప్రస్తుతం క్రైస్ట్‌చర్చ్‌లో ఇండియా 'ఎ' జట్టుతో ఉన్న కుశాగ్రా త్వరలోనే ప్రధాన జట్టుతో కలవనున్నాడు. తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్‌కు గాయం కావడం వల్లే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయాల్సి వచ్చిందని భారత బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కొటక్ వెల్లడించారు. ఇషాన్ కనీసం ఒక మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం రెండో టీ20కి మాత్రమే కుశాగ్ర ఎంపికయ్యాడు. తదుపరి మ్యాచులకు మార్పులు జరుగనున్నాయి.మరోవైపు ఇషాన్ కిషన్ స్థానంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తుది జట్టులోకి అడుగుపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆసియా క్రీడల ఫైనల్ తర్వాత వైభవ్ మళ్లీ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. తాజాగా వెస్టిండీస్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లోనూ బెంచ్‌కే పరిమితమైన ఈ యువ ఆటగాడికి ఇప్పుడు కీలక అవకాశం దక్కే ఛాన్స్ ఉంది. కిషన్ స్థానాన్ని భర్తీ చేస్తూ జట్టు విజయాల్లో వైభవ్ ఏ విధంగా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

చరిత్ర సృష్టించిన భారత సంతతి బాలిక శివానందన్!

చెస్‌లో భారత సంతతి బ్రిటన్ బాలిక బోధన శివానందన్ (11) చరిత్ర సృష్టించింది. ఇంటర్నేషనల్ మాస్టర్ (ఎఓ) హోదాను దక్కించుకున్న అతి పిన్నవయస్కురాలైన అమ్మాయిగా శివానందన్ రికార్డు సృష్టించింది. కేవలం 11 ఏళ్ల 7 నెలల16 రోజుల వయసులోనే ఈ ఘనతను సాధించింది. గతంలో ఈ రికార్డు చెస్ దిగ్గజం జుడిత్ పోల్గర్ పేరిట ఉండేది. 1988లో జుడిత్ పోల్గర్ ఈ అరుదైన ఘనత సాధించగా... దాదాపు 60 ఏళ్ల తర్వాత తాజాగా బోధన బద్దలు కొట్టింది. నెల క్రితం అతి పిన్న వయసులో ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ (చిఉఓ) ఘనతను సాధించిన బోధన.. తాజాగా ఐఎం సాధించడం ద్వారా మరో మైలురాయిని అందుకుంది.మొత్తం చెస్ చరిత్రలో (మహిళలు, పురుషులు కలిపి) ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించిన అతి పిన్న వయస్కుల్లో ఈ భారతీయ-బ్రిటన్ అమ్మాయి ఏడో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో బోధన.. భారత స్టార్ ప్లేయర్ గుకేశ్(9వ స్థానం) రికార్డును కూడా వెనక్కి నెట్టింది. లండన్‌లోని హారోలో పెరిగిన బోధన.. పాఠశాల విద్యతో పాటు చెస్‌ను సమన్వయం చేసుకుంటూ ఈ అద్భుత విజయాన్ని సాధించడం విశేషం.బోధన తల్లిదండ్రులు తమిళనాడులోని తిరుచ్చి జిల్లాకు చెందినవారు. ఉపాధి నిమిత్తం 2007లో యూకేకి వలస వెళ్లగా.. లండన్‌లో జన్మించిన బోధన ఐదేళ్ల వయసులోనే చెస్ బోర్డుతో పరిచయం ఏర్పరచుకుంది. ఆ తర్వాత క్రమంగా ఆటపై మక్కువ పెంచుకుని అంచెలంచెలుగా ఎదిగింది. తన అతితక్కువ కెరీర్‌లో ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ (చిఎఓ), ఉమెన్ ఫైడ్ మాస్టర్ (చిఈఓ) వంటి రికార్డులతో పాటు, గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన అతి పిన్న వయస్కురాలిగానూ ఆమె గుర్తింపు తెచ్చుకుంది. రాబోయే రోజుల్లో తాను గ్రాండ్‌మాస్టర్ (ఉఓ) టైటిల్ కూడా సాధిస్తానని బోధన ధీమా వ్యక్తం చేసింది. ఈ చిన్నారి విజయాలపై క్రీడా ప్రముఖులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.



ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా కీరన్ పోలార్డ్



ముంబై: ముంబై ఇండియన్స్ టీ20 జట్టుకు హెడ్‌కోచ్‌గా కీరన్ పోలార్డ్ నియమితుడయ్యాడు. ఐపీఎల్ 2027 సీజన్ నుంచి వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఆ బాధ్యతలను నిర్వర్తించనున్నాడు. గతంలో ప్లేయర్‌గా, బ్యాటింగ్ కోచ్‌గా ముంబై ఇండియన్స్‌కు పోలార్డ్ సేవలు అందించాడు. ఇక నుంచి అతను ప్రధాన కోచ్‌గా తన విధులను చేపట్టనున్నాడు. హెడ్ కోచ్ బాధ్యతల నుంచి మహేళ జయవర్దనే తప్పుకోవడంతో.. అతని స్థానంలో పోలార్డ్‌కు పదోన్నతి కల్పించారు. ప్లేయర్ నుంచి కోచ్ స్థాయికి పోలార్డ్ ఎదిగినట్లు ముంబై జట్టు తన ప్రకటనలో పేర్కొన్నది. 2009-2010 సీజన్ నుంచి 2022 సీజన్ వరకు అతను ముంబై జట్టులో ప్లేయర్‌గా కొనసాగాడు. ఐపీఎల్‌లో ముంబై తరపున 189 మ్యాచ్‌లు ఆడిన పోలార్డ్ .. వాటిల్లో 147.32 స్ట్రయిక్ రేట్‌తో 3412 రన్స్ చేశాడు. అతని బ్యాటింగ్ యావరేజ్ 28.67గా ఉన్నది. అతని ఖాతాలో 16 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో అతను 69 వికెట్లు తీసుకున్నాడు. కెరీర్ బెస్ట్ 4-44గా ఉంది.22 ఏళ్ల వయసులో పోలార్డ్ ముంబై జట్టులో చేరాడని, 16 ఏళ్లుగా అతను తమ కుటుంబంలో సభ్యుడిగా మారారని, ప్లేయర్‌గా ఎన్నో అద్భుత క్షణాలను అందించాడని, కోచ్‌గా తన అనుభవాలను పంచాడని, హెడ్‌కోచ్‌గా ఇప్పుడు పోలార్డ్ కొత్త బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని ముంబై ఇండియన్స్ జట్టు కో-ఓనర్ నీతా అంబానీ తన ప్రకటనలో పేర్కొన్నారు. హెడ్‌కోచ్ బాధ్యతలు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నట్లు పోలార్డ్ తెలిపాడు.

ఓడిపోయే మ్యాచ్‌లో టీమిండియాను గెలిపించిన తెలుగోళ్లు!

న్యూజిలాండ్ పర్యటనలో భారత్ జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా క్రైస్ట్‌చర్చ్ వేదికగా శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.తెలుగు తేజాలు తిలక్ వర్మ(26 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 51 నాటౌట్), నితీష్ కుమార్ రెడ్డి(13 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 26 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో అదిరిపోయే విజయాన్ని అందించారు. ఓటమి ఖాయమనుకున్న ఈ మ్యాచ్‌లో 69 పరుగుల అజేయ భాగస్వామ్యంతో గట్టెక్కించారు. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలో నిలిచింది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. గ్లేన్ ఫిలిప్స్(43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 70), బెవాన్ జాకోబ్స్(46 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 58) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(2/33) రెండు వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్(1/50), ప్రిన్స్ యాదవ్(1/30), నితీష్ కుమార్ రెడ్డి(1/31)తలో వికెట్ పడగొట్టారు.అనంతరం భారత్ 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 181 పరుగులు చేసి గెలుపొందింది. తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డితో పాటు నమన్ ధీర్(17 బంతుల్లో ఫోర్లు, 2 సిక్స్‌లతో 31) రాణించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్(4/21) నాలుగు వికెట్లు తీయగా.. జాకోబ్ డఫీ, నాథన్ స్మిత్ తలో వికెట్ తీసారు.181 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. తొలి వికెట్‌కు 40 పరుగులు జోడించిన అనంతరం సంజూ శాంసన్(14) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఇషాన్ స్థానంలో బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ(4) తీవ్రంగా నిరాశపర్చాడు. దాంతో భారత పరుగుల వేగం తగ్గింది. దూకుడుగా ఆడే క్రమంలో అభిషేక్ శర్మ(27) ఔటవ్వగా.. శ్రేయస్ అయ్యర్(7) సాంట్నర్ క్లీన్ బౌల్డ్ చేశాడు. డారిల్ మిచెల్ అద్భుతమైన రిలే క్యాచ్‌కు అక్షర్ పటేల్(11) వెనుదిరగడంతో భారత్ 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ పరిస్థితుల్లో నమన్ ధీర్, తిలక్ వర్మ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా నమన్ ధీర్ భారీ సిక్సర్లతో బ్యాటర్లపై ఒత్తిడి తగ్గించాడు. కానీ అతన్ని సాంట్నర్ ఔట్ చేయడంతో భారత్ ఓటమి ఖాయమని అంతా అనుకున్నారు. కానీ నితీష్ రెడ్డి సాయంతో తిలక్ వర్మ జట్టును విజయం దిశగా నడిపాడు. జాకోబ్ డఫీ వేసిన 17వ ఓవర్‌లో నితీష్ రెడ్డి సిక్స్ బాదదగా.. తిలక్ వర్మ రెండు బౌండరీలు కొట్టి 17 పరుగులు పిండుకున్నాడు. ఈ ఓవర్‌తో భారత్‌కు మూమెంటమ్ లభించింది.



ప్రపంచ రికార్డు.. ఫీల్డింగ్‌లో తిలక్ వర్మ సంచలనం



భారత యువ క్రికెటర్ తిలక్ వర్మ సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టీ20లో ఓ అరుదైన ఘనతను అందుకున్నాడు. అయితే ఈ రికార్డు బ్యాటింగ్‌లో కాదు.. ఫీల్డింగ్ కావడం విశేషం. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆటగాడిగా తిలక్ వర్మ చరిత్ర సృష్టించాడు.మ్యాచ్ ఆరంభంలోనే న్యూజిలాండ్ బ్యాటర్లు టిమ్ సీఫర్ట్, డారిల్ మిచెల్ ఇచ్చిన క్యాచ్‌లను తిలక్ అందుకున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సీఫర్ట్‌ను, భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో మిచెల్‌ను పెవిలియన్‌కు పంపడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ రెండు క్యాచ్‌లతో ఈ ఏడాది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో తిలక్ ఖాతాలో మొత్తం 26 క్యాచ్‌లు చేరాయి. దీంతో ఇండోనేషియా ఆటగాడు డానిల్సన్ హోవే పేరిట ఉన్న 25 క్యాచ్‌ల రికార్డును తిలక్ అధిగమించాడు.ఇక మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. 181 పరుగుల లక్ష్య ఛేదనకి దిగిన భారత్.. ఈ వార్త రాసే సమయానికి 7 ఓవర్లకు భారత్ 2 వికెట్ల నష్టానికి 47 పరుగులు చేసింది. సంజు శాంసన్(14), వైభవ్ సూర్యవంశీ(4) పూర్తిగా నిరాశపర్చారు.

న్యూజిలాండ్‌తో రెండో టీ20: భారత్ టార్గెట్ ఎంతంటే?



క్రిస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్-భారత్ జట్లు రెండో టీ20లో తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. భారత్‌కు 181 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. గ్లెన్ ఫిలిప్స్(70; 43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), జాకబ్స్(58; 46 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలు చేశారు. మిగతా బ్యాటర్లంతా స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరారు.ఓపెనర్ టిమ్ సీఫర్ట్(7), ఫిన్ అలెన్(16), డారెల్ మిచెల్(6), మిచెల్ శాంట్నర్(4×), బ్రేస్‌వెల్(10) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 2, భువనేశ్వర్ కుమార్, ప్రిన్స్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి తలొక వికెట్ పడగొట్టారు. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 1-0 తేడాతో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే.

జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్.. ముంబై ఇండియన్స్ కొత్త హెడ్ కోచ్‌గా బాధ్యతలు..



ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. జట్టు కొత్త ప్రధాన కోచ్‌గా వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్‌ను నియమించింది. ఇప్పటివరకు ముంబై జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించిన పొలార్డ్‌కు ప్రధాన కోచ్ బాధ్యతలు అప్పగించింది. ఇటీవల మహేల జయవర్ధనే హెడ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ముంబై ఇండియన్స్ ఈ నిర్ణయం తీసుకుంది ముంబై ఇండియన్స్‌తో పొలార్డ్ కు సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆటగాడిగా ఆ జట్టు తరఫున ఎన్నో విజయాల్లో పొలార్డ్ కీలక పాత్ర పోషించాడు. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. తాజాగా ప్రధాన కోచ్‌గా పదోన్నతి పొందాడు. ముంబై ఇండియన్స్ జట్టు సంస్కృతి, ఆటగాళ్ల సామర్థ్యాలు, ఐపీఎల్ పోటీ తీరుపై పొలార్డ్‌కు మంచి అవగాహన ఉంది. ఆటగాడిగా, బ్యాటింగ్ కోచ్‌గా సంపాదించిన అనుభవం కొత్త బాధ్యతల్లో ఉపయోగపడుతుందని జట్టు యాజమాన్యం భావిస్తోంది.ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా మహేల జయవర్ధనే తన బాధ్యతల నుంచి అక్టోబర్ 17న తప్పుకున్నాడుదీంతో 2027 సీజన్‌కు ముందు జట్టు కొత్త కోచ్‌ను నియమించాల్సి వచ్చింది. జయవర్ధనే గతంలో 2017 నుంచి 2022 వరకు ముంబై ఇండియన్స్‌కు ప్రధాన కోచ్‌గా వ్యవహరించాడు. జయవర్ధనే ఆధ్వర్యంలో ముంబై జట్టు 2017, 2019, 2020 సీజన్లలో ఐపీఎల్ టైటిళ్లు సాధించింది. 2024లో తిరిగి ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముంబై 2025లో క్వాలిఫయర్-2 వరకు చేరింది. అయితే, 2026 సీజన్‌లో జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.

భువనేశ్వర్ కుమార్ రీఎంట్రీపై దినేశ్ కార్తీక్ కీలక వ్యాఖ్యలు..

దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత టీమిండియాలోకి రీఎంట్రీ ఇచ్చిన సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు తొలి మ్యాచ్‌లోనే నిరాశ ఎదురైంది. న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన తొలి టీ20 మ్యాచ్ ద్వారా భువీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలో అద్భుతమైన ప్రదర్శన కనబరచడంతో, 2022 తర్వాత మళ్లీ భారత జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అయితే, అతని రీఎంట్రీ మ్యాచ్ మాత్రం ఆశించిన స్థాయిలో సాగలేదు.ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ తన 4 ఓవర్ల కోటాలో ఏకంగా 49 పరుగులు సమర్పించుకుని వికెట్లేమీ పడగొట్టలేదు. ముఖ్యంగా అతను రెండు నో-బాల్స్ వేయడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఈ నేపథ్యంలో భువీ రీఎంట్రీపై టీమిండియా మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సాధారణంగా భువీ నో-బాల్స్ వేసే బౌలర్ కాదని, మ్యాచ్‌లో ఒత్తిడి లేదా శారీరకంగా తాను పూర్తిగా సిద్ధంగా లేకపోవడం వల్లే ఇది జరిగి ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. తొలి, ఆఖరి ఓవర్లు బాగానే వేసినప్పటికీ, మధ్యలో వేసిన ఓవర్లలో నో-బాల్స్ రావడం వల్ల భారీగా పరుగులు వచ్చాయని కార్తీక్ తెలిపాడు. న్యూజిలాండ్ మ్యాచ్‌లో భువీ తన స్థాయి ఆట ఆడలేదని ఈ మాజీ క్రికెటర్ అభిప్రాయపడ్డాడు.అయితే ఒకవైపు భువీని విమర్శిస్తూ, మరోవైపు అతడికి మద్దతుగా నిలిచాడు. ఒకే మ్యాచ్‌తో సీనియర్ ఆటగాడిని అంచనా వేయవద్దని, అభిమానులు భువీకి కాస్త మద్దతుగా నిలవాలని కార్తీక్ కోరాడు. సుమారు నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్నందున అతనికి కొంత సమయం ఇవ్వాలని సూచించాడు. భువనేశ్వర్ తన తప్పులను సరిదిద్దుకుని తదుపరి మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తాడని క్రీడా విశ్లేషకులు కూడా భావిస్తున్నాడు.



సినిమా

రియాలిటీ' మూవీ నుంచి వీడియో సాంగ్ 'భజ గోవిందం' రిలీజ్

ప్రామిసింగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్టాత్మక చిత్రం 'రియాలిటీ'తో నిత్యజీవితంలోని సహజమైన భావోద్వేగాలను, మన చుట్టూ ఉండే చిన్న చిన్న ఆనందాలను అందంగా ప్రజెంట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. 'క', 'కె-రాంప్' చిత్రాల విజయాలతో జోరుమీదున్న ఆయన, ఈ సినిమాకు హీరోగా నటించడంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే అందించి దర్శకత్వం కూడా వహిస్తున్నారు. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

మేకర్స్ తాజాగా ఈ సినిమా సంగీత ప్రయాణాన్ని ప్రారంభిస్తూ తొలి పాట 'భజ గోవిందం' ఫుల్ వీడియోను విడుదల చేశారు. గతంలో విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు మంచి స్పందన లభించగా, ఈ పాట సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతోంది. 'రియాలిటీ' జీవితానికి ఆంథమ్‌లా నిలిచే ఈ పాట, జీవితంలోని చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలనే సినిమా ప్రధాన సందేశాన్ని అందంగా ఆవిష్కరిస్తోంది.

భీమ్స్ సిసిరోలియో ప్రశాంతమైన, భక్తిభావంతో కూడిన మెలోడీని స్వరపరిచారు. సనారే అందించిన అర్థవంతమైన సాహిత్యం మన దగ్గర ఉన్నదానితో సంతృప్తిగా ఉండటం, మనం చేసే పనిని ప్రేమించడం, స్వయంగా ఎదగడం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. జీవితంలోని బాధ్యతల మధ్య మన కోసం మనం కొంత సమయాన్ని కేటాయించుకోవాల్సిన అవసరాన్ని కూడా ఈ పాట గుర్తుచేస్తోంది.

వైకోమ్ విజయలక్ష్మి వాయిస్ పాటకు ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన అనుభూతిని అందించింది. సంగీతానికి తగ్గట్టుగా రూపొందించిన విజువల్స్‌లో పల్లెటూరి జీవితంలోని అందం కనిపిస్తుంది. కిరణ్ అబ్బవరం హోటల్ నడుపుతూ, స్నేహితులు, కుటుంబ సభ్యులతో విలువైన క్షణాలను ఆస్వాదించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఆయన సహజమైన నటన, హావభావాలు రోజువారీ జీవితంలోని చిన్న చిన్న సంఘటనలకు ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చాయి. ప్రతి సన్నివేశం నిజ జీవితానికి దగ్గరగా, మనసుకు హత్తుకునేలా ఉంది.



ఆకట్టుకునే సంగీతం, ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే భావోద్వేగాలతో 'భజ గోవిందం' 'రియాలిటీ' సినిమాకు తగిన ఆంథమ్‌గా నిలుస్తోంది. మన దగ్గర ఉన్నవాటిని అభినందించడం, జీవితంలోని చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతుక్కోవడమే నిజమైన సంతోషమనే సందేశాన్ని ఈ పాట అందంగా తెలియజేస్తోంది. ఈ పాట మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచి బ్లాక్‌బస్టర్ హిట్‌గా మారుతోంది.

ఈ సినిమాలో దేవిక భట్ కథానాయికగా నటిస్తుండగా, శరత్ కుమార్, సాయికుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

విశ్వాస్ డేనియల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. సుధీర్ మాచర్ల ప్రొడక్షన్ డిజైన్ , సంతోష్ నాయుడు ఎడిటర్‌గా, రాజేశ్ కామార్సు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.

'రియాలిటీ' సినిమా 2026 డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

నటీనటులు: కిరణ్ అబ్బవరం, దేవిక భట్, శరత్ కుమార్, సాయికుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ తదితరులు.

జో జో' కాషన్ 2 సినిమా ఇంట్రెస్టింగ్ వీడియో రిలీజ్

హీరో, హీరోయిన్‌ని ప్రేమిస్తానంటాడు.. దానికి బదులుగా"పడుచు పిల్ల కానొస్తే... ఓ నాలుగు దినాలు వెనక పడి... పని కానిచ్చుకొని... పారిపోయే టైపా?

ఇష్టపడిన పిల్లని దాని బాధ్యతలతో సహా పెళ్ళి చేసుకొని దాన్ని జీవితాంతం మోసెంత గుండకాయ ఉన్న మొగోడి టైపా అని" ఆ పిల్ల ప్రశ్నిస్తాది .. దానికి హీరో బదులిస్తూ..

"సత్య ప్రమాణికంగా చెబుతున్నా

ఒకతూరి మాట ఇచ్చినానంటే

మడమ తిప్పని వంశం మాది... బాలయ్య బాబు టైపు" అని హీరో గడుసుగా సమాధానం ఇస్తాడు.

హీరోయిన్ మరి హీరోని ప్రేమిస్తాదా! అని తెలియాలంటే మాత్రం 'జో జో' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. కృష్ణ కమల్ , మహి హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న రూరల్ కామెడీ డ్రామా 'జో జో'. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రముఖ దర్శకుడు దేవకట్టా సమర్పణలో కిరణ్ జయ్ కుమార్ దర్శకుడిగా రూపొందుతోంది. విజయం బ్యానర్‌పై విజయ్ కృష్ణ లింగమనేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన కాషన్ 1కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో మేకర్స్.. గురువారం జో జో సినిమా నుంచి కాషన్ 2 వీడియో విడుదల చేశారు.

జొన్నగిరి బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. మనోభావాల బ్యాచ్ దూరంగా ఉండండంటూ విడుదలైన కాషన్1కు ఏమాత్రం తీసిపోని రేంజ్‌లో కాసన్ 2 ఉంది. రా రస్టిక్ రొమాంటిక్ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాషన్ వన్ వీడియోతో సినిమాపై మేకర్స్ క్యూరియాసిటీ క్రియేట్ చేశారు. సినిమాకు సంబంధించి మరికొన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు.

నటీనటులు:



కృష్ణ కమల్, మహి, మకరంద్ దేశ్‌పాండే, ఫణీంద్ర దేవరపల్లి, భాష, రాజు, సతీష్ దేవట్టె, శరత్, ప్రభావతి తదితరులు



రోమియో జూలియట్' మూవీ రొమాంటిక్ యాక్షన్ పోస్టర్

హర్షిత్, విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న 'రోమియో జూలియట్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. భార్గవ్ మాచర్ల రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ సమర్పిస్తుండగా, నవరస ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సుందీప్ ఎన్, వెంకటేశ్వరరావు చల్లగుళ్ల నిర్మిస్తున్నారు.

దసరా పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 'రోమియో జూలియట్' నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ రొమాన్స్, యాక్షన్ అంశాల కలయికతో ఆకట్టుకుంటోంది.పోస్టర్‌లో హర్షిత్ సన్‌గ్లాసెస్ ధరించి, చేతిలో గన్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. విశాఖ ధిమాన్ ఎరుపు రంగు దుస్తుల్లో అందంగా కనిపిస్తున్నారు. చుట్టూ ముళ్ల తీగలు, ఎర్ర గులాబీలు, గాలిలో ఎగురుతున్న పూలరేకులు కనిపిస్తున్నాయి. బుల్లెట్లు పోస్టర్‌కు యాక్షన్ ఫీల్‌ను తీసుకొస్తే, గులాబీలు, ఎరుపు రంగు రొమాంటిక్ కోణాన్ని హైలైట్ చేస్తున్నాయి.

ఇప్పటికే రెబల్ స్టార్ ప్రభాస్ విడుదల చేసిన ఈ సినిమా 'స్టోరీ రివీల్' గ్లింప్స్ కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ట్యుయేషన్‌షిప్స్, క్యాజువల్ రిలేషన్‌షిప్స్, బ్రేకప్స్, యువ జంటల మధ్య మారుతున్న సంబంధాలను 'రోమియో జూలియట్' ప్రజెంట్ చేయనుంది. నేటి యువత తమ ప్రేమ సంబంధాల్లో ఎదుర్కొంటున్న అనుభవాలు, ఆలోచనలకు అద్దం పట్టే కథతో జెన్-జెడ్ ప్రేక్షకులని అలరించేలా వుంటుంది.

ఈ సినిమాలో వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శ్రీను, అజయ్ ఘోష్, అజయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

భార్గవ్ మాచర్ల, ప్రశాంత్ రాగతి కథను అందించగా, గోపీసుందర్ సంగీతం సమకూరుస్తున్నారు. అభిరాజ్ నాయర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, యువ కిరణ్ ఎడిటింగ్ . కార్తా ప్రొడక్షన్స్ ధీరజ్ పొనుగోటి, ప్రకీర్తి ఉప్పలపాటి ప్రొడక్షన్ డిజైనర్స్.

నటీనటులు: హర్షిత్, విశాఖ ధిమాన్, వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శ్రీను, అజయ్ ఘోష్, అజయ్

పరిణీతి చోప్రా మైండ్ సెట్‌కు హర్లీన్ సేథీ హాట్సాఫ్!



గ్లామర్ ప్రపంచంలో నిరంతరం వెలుగుజిలుగుల మధ్య గడిపే సినీ తారలపై రకరకాల విమర్శలు రావడం సహజమే. అయితే ప్రసవానంతరం మహిళా నటీమణులు ఎదుర్కొనే శరీర ఆకృతి (బాడీ షేమింగ్) మార్పులపై జరిగే ట్రోలింగ్‌ను బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా ఎంతో ధైర్యంగా.. హుందాగా ఎదుర్కొని అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె ఆలోచనా విధానానికి.. మైండ్ సెట్‌కు తన సహనటి హర్లీన్ సేథీ హాట్సాఫ్ చెబుతూ అభినందనలు కురిపించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పరిణీతి చోప్రా తల్లిదండ్రుల బాధ్యత, ప్రసవానంతర మార్పులపై స్పందిస్తూ పిల్లలు పుట్టిన తర్వాత మహిళల శరీరంలో వచ్చే మార్పులను, స్ట్రెచ్ మార్క్స్‌ను ప్రతికూలంగా చూడటం అజ్ఞానానికి పరాకాష్ట అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఒక జీవికి జన్మనివ్వడం అనే అద్భుతమైన ప్రక్రియలో భాగమైన శరీరాన్ని తక్కువ చేసి మాట్లాడటం సరికాదని.. అలాంటి మార్పులను చూసి గర్వపడాలే తప్ప కుంగిపోకూడదని ఆమె స్పష్టం చేశారు. పరిణీతి వెల్లడించిన బోల్డ్ అండ్ పాజిటివ్ మైండ్ సెట్‌పై నటి హర్లీన్ సేథీ ప్రశంసల వర్షం కురిపించారు. సమాజం, సోషల్ మీడియా విధించే అనవసరపు ఒత్తిళ్లకు తలొగ్గకుండా తన అభిప్రాయాన్ని బలంగా వినిపించిన పరిణీతి ధైర్యాన్ని హర్లీన్ అభినందించారు. ఇండస్ట్రీలో తోటి నటీమణులకు ఈ తరహా ఆత్మవిశ్వాసం, స్పష్టత ఎంతో అవసరమని పేర్కొన్నారు. గతంలో అనేకమంది కథానాయికలు ప్రసవానంతరం లేదా బరువు పెరిగిన సమయంలో విపరీతమైన ట్రోలింగ్ ఎదుర్కొన్నారు. అయితే 'సినిమా శరీరం కంటే నిజ జీవితంలో మహిళల ఆరోగ్యం, వారి ఆనందమే ముఖ్యం' అనే ఆలోచనను బలంగా సమాజంలోకి తీసుకెళ్లడంలో పరిణీతి విజయం సాధించారు. బాడీ షేమింగ్ చేసే నెటిజన్ల నోళ్లకు చెక్ పెడుతూ ఆమె ఇచ్చిన సమాధానం నెట్టింట చర్చనీయాంశమైంది. కెరీర్ పరంగానూ పరిణీతి చోప్రా డిజిటల్, థియేట్రికల్ ప్రాజెక్టులతో బిజీగా ఉంటూనే వ్యక్తిగత జీవితాన్ని సమర్థవంతంగా బ్యాలెన్స్ చేస్తున్నారు. విమర్శల కంటే పనికే ప్రాధాన్యం ఇస్తూ మానసిక దృఢత్వాన్ని ప్రదర్శిస్తున్న తీరును నెటిజన్లు, సినీ విశ్లేషకులు సైతం కొనియాడుతున్నారు. ఈ సమాధానంతో ఆమె అనవసరమైన విమర్శలన్నింటికీ శాశ్వతంగా ముగింపు పలికారనే చెప్పాలి. మొత్తానికి బాడీ షేమింగ్‌పై పరిణీతి చోప్రా చూపిన దృఢమైన వైఖరి, దానికి హర్లీన్ సేథీ తెలిపిన మద్దతు ఇండస్ట్రీలో మంచి మార్పుకు సంకేతంగా నిలిచాయి. సౌందర్య ప్రమాణాల పేరిట మహిళలపై రుద్దే పాతకాలపు ఆలోచనలను తిప్పికొడుతూ ప్రతి ఒక్కరూ తమ శరీరాన్ని ఆమోదించి గౌరవించాలని ఈ సంఘటన చాటి చెబుతోంది.

ఆ అంశంపై రష్మిక బోల్డ్ ఆన్సర్!

ఇండస్ట్రీలో స్టార్స్‌గా వెలుగొందుతున్న సెలబ్రిటీలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్స్ రావడం సాధా రణమైపోయింది. ముఖ్యంగా భాషా ఉచ్చారణ, యాస విషయాల్లో హీరోయిన్లు తరచూ నెటిజన్ల టార్గెట్ అవుతుంటారు. తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న హిందీ యాసపై జరిగిన ట్రోలింగ్‌కు సంబంధించి ఇచ్చిన బోల్డ్ ఆన్సర్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విమర్శలన్నింటికీ రష్మిక తనదైన శైలిలో ఘాటుగా.. ఎంతో హుందాగా బదులిచ్చారు. ట్రోలర్లు వినోదం కోసమో లేక నెగెటివిటీని స్ప్రెడ్ చేయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కామెంట్లు చేస్తుంటారని రష్మిక భావిస్తున్నారు. ఏ భాషలోనైనా మాట్లాడేటప్పుడు ప్రతి ఒక్కరికీ వారి మాతృభాష ప్రభావం లేదా ప్రాంతీయ ఛాయలు ఉండటం సహజం. కానీ కొందరు దీనిని భూతద్దంలో పెట్టి చూపిస్తూ ట్రోల్ చేస్తుంటారు. ఈ తరహా నెగెటివ్ కామెంట్స్ తనపై ఎలాంటి ప్రభావం చూపవని స్పష్టం చేశారుఇలాంటి విమర్శలను తానెప్పుడు నెగెటివ్‌గా తీసుకోలేదని.. వాటిని ఒక సవాల్‌గా స్వీకరిస్తానని రష్మిక పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు తన నటనను, భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి విమర్శలు ఒక మెట్టుగా ఉపయోగపడతాయని నమ్ముతారు. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే మానసిక ధృడత్వం ఎంత ముఖ్యమో తన సమాధానం ద్వారా నిరూపించారు. ట్రోలింగ్‌ను చూసి కుంగిపోకుండా మరింత కష్టపడే తత్వమే తనను ఈ స్థాయికి చేర్చిందని తెలిపారు. సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలపై.. వారి చిన్న చిన్న లోపాలపై ట్రోల్స్ చేసేవారికి రష్మిక ఇచ్చిన జవాబు గట్టి చురక లాంటిదంటున్నారు. ముఖ్యంగా మహిళా ఆర్టిస్టులపై జరిగే ట్రోలింగ్‌ను నిర్భయంగా ఎదుర్కొన్న తీరు నవతరం భామలకు స్ఫూర్తిదాయకం. ఏ విషయంలోనైనా భయపడి వెనకడుగు వేయకుండా.. నిలబడి సమాధానం చెప్పడమే సరైన మార్గమని రష్మిక మరోసారి రుజువు చేశారు.ప్రస్తుతం రష్మిక కెరీర్ పరంగా ఎంతో బిజీగా ఉన్నారు. వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో దూసుకుపోతున్న తరుణంలో ఇలాంటి చిన్నచిన్న విమర్శలను అసలు పట్టించుకోవడం లేదు. తన ఫోకస్ అంతా కెరీర్, నటనపైనే ఉందని క్లారిటీ ఇచ్చారు. విమర్శకులు ఎలాంటి అడ్డంకులు సృష్టించినా? తనదైన అంకితభావంతో ముందుకు సాగుతానని నిరూపిస్తున్నారు. ట్రోలర్స్‌కు రష్మిక ఇచ్చిన బోల్డ్ అండ్ క్లాసీ ఆన్సర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గ్లామర్ పాత్రలకే పరి మితం కాకుండా వ్యక్తిగతంగానూ తాను ఎంతో స్ట్రాంగ్ అని రష్మిక మరోసారి నిరూపించుకున్నారు. ప్రతికూలతను కూడా అనుకూలంగా మార్చుకుని విజయాల దిశగా అడుగులు వేస్తున్న రష్మిక ప్రయాణం నేటి యువతకు మంచి ఆదర్శంగా నిలుస్తుంది.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844